గ్రూప్-1 మెయిన్స్ గడువు పొడిగించాలి

టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హమీద్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : త్వరలో జరగబోయే ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కోసం మూడు నెలలు అదనంగా సమయం కేటాయించాలని టీడీపీ అనుబంధ విద్యార్థి విభాగం టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌హమీద్ అన్నారు. ఈ మేరకు సోమవారం కడప కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఉన్నత అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏపీపీఎస్సీ కార్యాలయం ముట్టడించేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష క్వాలిఫై ఆయన అభ్యర్థులు ప్రిపరేషన్ కోసం కనీసం అంటే 85 రోజులు గడువును మాత్రమే ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణం అన్నారు.నిరుద్యోగుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని గడువు పెంచాలని టిఎన్ఎస్ఎఫ్ ద్వారా డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. మెయిన్స్ లో ఏడు పేపర్లు ప్రిపేర్ కావడానికి ఈ సమయం ఏమాత్రం చాలదన్నారు. కొత్త అభ్యర్థులే కాకుండా ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా గ్రూప్-1 పరీక్షలు రాస్తున్నారని అందువల్ల ప్రభుత్వం సానుభూతితో ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మహావీర్, మహేష్, కిషోర్, ప్రదీప్, ఇమామ్‌బాషా పాల్గొన్నారు.

చలివేంద్ర ఏర్పాటు చేయడం అభినందనీయదగ్గ విషయం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : వేసవికాలంలో ప్రజలకు అవసరమయ్యే నీటిని చలివేంద్రం ద్వారా అందించడం అభినందనీయమని ఆర్టీసీ ఆర్ఎం గోపాల్ రెడ్డి డిఎం దిలేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌డిసి) వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు అధికంగా కాస్తున్న సందర్భంగా బస్టాండుకు ఎక్కడెక్కడో సుదీర్ఘ ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో కడప ఆర్టిసి బస్టాండ్ చలివేంద్ర ఏర్పాటు చేసినందుకు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ డివిజన్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ బాషా, జనరల్ సెక్రటరీ విజయ భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ కె శివ సుబ్బన్న, వైస్ ప్రెసిడెంట్ గౌస్ బాషా, వైస్ ప్రెసిడెంట్ కమాల్ బాషా, కడప జిల్లా జనరల్ సెక్రటరీ రాజ శేఖర్ రాజు, డివిజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్ర బోస్, మహిళా అధ్యక్షురాలు విమల, పర్వీన్, సభ్యులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలంటూ తహశీల్దార్‌కు టీడీపీ వినతి

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లె మండలంలో ఇటీవల సంబవించిన పెనుగాలులు, అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలంటూ సోమవారం తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ షబ్బీర్, రైతు విభాగము అధ్యక్షుడు దుర్గన్న గారి పల్లి నాగభూషణ్ రెడ్డి, యూనిట్ నెంబర్ పాపిరెడ్డి యూనిట్ నెంబర్ ముత్తుకూరు లక్ష్మీనారాయణ వేంపల్లి క్లస్టర ఇన్చార్జి షేక్ మొహమ్మద్ మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి జెబివుల బాబావల్లి మండల బీసీ నాయకులు గోగుల మల్లికార్జున, డక్కా రమేష్, రైతులు కలసివినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు అరటి, మామిడి, చీనీ, నిమ్మ తోటలతో పాటు నూగు, ప్రొద్దుతిరుగుడు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఎక్కువగా అలిరెడ్డిపల్లె, ఇడుపులపాయి, కుమ్మరాంపల్లె, వేంపల్లి చక్రాయ్ పేట మండలలో మామిడి, నిమ్మ, చీనీ చెట్లు విరిగి పోవడంతో పాటు చెట్లుకు ఉన్న కాయాలు, పిందేలు పూర్తిగా రాలిపోయినట్లు చెప్పారు. కాయలు, పిందెలు పూర్తిగా రాలిపోవడంతో రైతులకు భారీగా నష్టం వాటిల్లిందని చెప్పారు. ముఖ్యమంత్రికి చెందిన సొంత వ్యవసాయ క్షేత్రమైన ఇడుపులపాయి ప్రాంతంలోని రైతులు భారీగా నష్ట పోయారని అన్నారు. సర్వే నామమాత్రంగా చేపట్టడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు మల్లికార్జున, వేంపల్లి రామకృష్ణ, చిన్న రాయుడు, పోతిరెడ్డి గోపి, గోగుల మారుతి షేక్ మాబులు పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రంలోని అవకతవకలతో విద్యార్థుల జీవితాలు సందిగ్ధం

విశాలాంధ్ర-బద్వేల్ : స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ బద్వేల్ ఏరియా కార్యదర్శి ఎం అశోక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు యధావిధిగా ఈరోజు కూడా ఫిజిక్స్ పేపర్ 2 పరీక్ష నిర్వహించారు.ఫిజిక్స్ ఇంగ్లీష్ పస్నాప్రత్నంలో సెక్షన్ ఎలో మూడవ ప్రశ్న తెలుగులో కూడా ఒకే విధంగా ఉండడంతో మార్పు చేశామంటూ స్టేట్ ఎడ్యుకేషన్ అధికారులు పరీక్ష కేంద్రాల్లోని సీఎస్‌లకు సమాచారాన్ని ఇవ్వడం కోసం కీప్యాడ్ సెల్ ఫోన్ లను అందించారు. మెసేజ్ రూపంలో మార్పు జరిగిన ప్రశ్న ను సమాచారంగా అందించారు. అయినప్పటికీ కడప జిల్లా బద్వేలులో ఒక కళాశాలలో మాత్రం సీఎస్ సమాచారాన్ని ఇవ్వకపోవడంతో ప్రశ్నాపత్రం లో వచ్చిన ప్రశ్నకు యధావిధిగా సమాధానాన్ని విద్యార్థులు రాశారు. పరీక్ష అనంతరం విద్యార్థులు విషయాన్ని తెలుసుకొని అయోమయంలో ఉన్నారన్నారు. ప్రభుత్వం అందించిన ప్రశ్న పత్రంలోని ప్రశ్నకు విధించిన మార్కులు రాసిన ప్రతి విద్యార్థికి వేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషనర్‌ని కోరారు. విద్యార్థులు ఆ ప్రశ్నకు విధించిన మార్కులతో ఫెయిల్ అయ్యే విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో ఉంటారని కొందరు ఆ మార్కులతోనే ఉత్తీర్ణతస్థాయిలో రావడానికి అవకాశం ఉండదేమోనని అదేవిధంగా ఎంసెట్ అప్లై చేసిన విద్యార్థులకు ఈ మార్కులు ప్రభావితం చూపుతాయని వారు రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషనర్‌కి వివరించారు. రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషనర్ గారు సానుకూలంగా స్పందించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

- ఎంపీపీ గడ్డం, రాష్ట్ర గిడ్డంగుల డైరెక్టర్ ఆకేపాటి

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : చిరుధాన్యాలతోనే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని సిరిధాన్యాలలో ఎలాంటి రసాయనాలు వాడరని అందువలన ఈ ఆహారం తింటే మనిషి ఆరోగ్యంతో పాటు రోగనిరోధకశక్తి పెరుగుతుందని తద్వారా పేదలు సిరిధాన్యాల సంగటి తినాలని ఒంటిమిట్ట ఎంపీపీ గడ్డం జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని శ్రీశ్రీ కాశీవిశ్వేశ్వర దేవాలయం నందు సీనియర్ విలేకరి కట్టా సుబ్బరాయుడు ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర గిడ్డంగుల డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఒంటిమిట్ట ఎంపీపీ గడ్డం జనార్ధన్‌రెడ్డి హాజరై పేదలకు అన్నప్రసాదం వితరణ చేశారు. ఈ వితరణకు పెద్దఎత్తున పేదలు, బాటసారులు, భక్తులు, యాచకులు హాజరై స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ముందుగా వారిద్దరు శివాలయంలోకి వెళ్లి శివుని ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సోమవారం పేదలకు రాగిసంగటి, చెన్నక్కాయల పచ్చడి పెట్టడం శుభసూచికమని పేదల ఆకలి తీరిస్తే దేవునికి టెంకాయ కొట్టినట్లేనని మరింతమంది దాతలు ముందుకు వచ్చి ఈ దేవాలయ అభివృద్ధికి అన్నదాన కార్యక్రమాన్ని కూడా ప్రతి సోమవారం జరిగేలా సహకరించాలని వారు మండల భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నర్వకాటపల్లె సర్పంచ్ ఎం.ఎస్.వెంకటరెడ్డి, ఒంటిమిట్ట మండల వైసీపీ కన్వీనర్ గజ్జల శీను, సాక్షి విలేకరి ప్రదీప్, ఏసీఎన్ విలేకరి ఆదినారాయణ, సూర్య విలేకరరి ముస్తఫా, టీవీ9 సుబ్బరాయుడు, ప్రతినిత్యం విలేకరి యనమదల కిరణ్‌కుమార్, ప్రజాశక్తి విలేకరి మురళి, ఆంధ్రపత్రిక విలేకరి పత్తి శీను, విశాలాంధ్ర విలేకరి గుండ్రాతి మహేశ్వరయ్య, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ అపహరణ హత్య కేసులో ముగ్గురు

అదే శాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ సర్జన్ ప్రధాన ముద్దాయి: జిల్లా ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

విశాలాంధ్ర-కడప క్రైం : కడప నగరంలోని పశువైద్య శాఖలో డిప్యూటీ డైరెక్టర్ సి.అచ్చన్న అపహరణ, హత్య కేసులో అదే శాఖలో పనిచేస్తున్న సివిల్ సర్జన్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్‌తో పాటు మరో ఇరువురిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ తెలిపారు. ఈ హత్య కారణం వారి డ్యూటీ విషయాలలో డాక్టర్ అచన్న వర్సెస్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్ మధ్య కొన్ని తీవ్రమైన అపార్థాలు వివాదాలు ఏర్పడ్డాయన్నారు. ఈ నెల 12వ తేదీ నుండి తన తండ్రి అచ్చన్న కనిపించడం లేదని కుమారుడు డాక్టర్ క్లింటన్ చక్రవర్తి ఈ నెల 14న కడప వన్ టౌన్ పోలీసులకు డాక్టర్ సుభాష్ చంద్రబోస్, ఇతర కార్యాలయ సిబ్బందిని అనుమానితులుగా పేర్కొంటూ మిస్సింగ్ కేసు పెట్టారన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ డాక్టర్ అచ్చన్న ఆచూకీ కోసం ప్రత్యేక టీములు ఏర్పాటు చేయడమే కాకుండా సీసీ కెమెరాలు, కాల్ డేటా ఆధారంగా విచారణ చేపట్టామన్నారు. డాక్టర్ సి.అచ్చన్న 2021 నుండి కడపలోని వెటర్నరీ పాలీ క్లినిక్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్నారన్నారు. అదే ఆసుపత్రిలో డాక్టర్ సుభాష్ చంద్రబోస్ 2022 నుండి అసిస్టెంట్ సర్జన్‌గా పని చేస్తున్నారు. వారి డ్యూటీ విషయాలలో డాక్టర్ అచ్చన్న వర్సెస్ డాక్టర్ సుభాష్ చంద్రబోస్ మధ్య కొన్ని తీవ్రమైన అపార్థాలు, వివాదాలు ఏర్పడ్డాయన్నారు. డిప్యూటీ డైరెక్టర్ అచ్చన్న డాక్టర్ సుభాష్ చంద్రబోస్, సిబ్బంది జీతాలను 3 నెలల పాటు నిలిపి వేసి వారిని సి.ఎఫ్.ఎం.ఎస్, ఎఫ్.ఆర్.ఎస్ సిస్టముల నుండి తొలగించి ప్రభుత్వానికి సరెండర్ కూడ చేశారన్నారు. ఇదే నేరానికి ప్రధాన కారణమన్నారు. ఈ ఇరువురి మధ్య విబేదాలు ఏర్పడడంతో ప్రధాన కార్యాలయం నుండి ముగ్గురు సభ్యుల కమిటీ కడప వచ్చి విచారించారన్నారు. డాక్టర్ అచ్చన్న కారణంగా సుభాష్ చంద్రబోస్ కు శాలరీ పడక పోవడం, ఇ.ఎం.ఐలు కట్టేందుకు కష్టతరం కావడం ఆర్థికంగా ఇబ్బంది ఎదుర్కొనడంతో పాటు మానసికంగా అవమానికి గురయ్యారన్నారు. దీంతో డాక్టర్ అచ్చన్నను ఎలాగైనా హత్య చేయాలని డాక్టర్ సుభాష్ చంద్రబోస్ నిర్ణయించు కున్నారన్నారు. ఇందులో భాగంగా సుభాష్ చంద్రబోస్ ఈ నెల 9వ తేదీ పోరుమామిళ్లకు వెళ్లి అక్కడ వినాయక లాడ్జీలో తనకు వరుసకు బావమరిది అయిన బావలూరి చెన్నకృష్ణను, మెడికల్ స్టోర్ పార్టనర్ అయిన మూడే బాలాజీ నాయక్‌లను కలుసుకున్నారన్నారు. ఈ ముగ్గురు అదే లాడ్జీలో వుండి 11వ తేదీ వరకు అచ్చెన్న హత్యకు కుట్ర పన్నారన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు బొలెరో పికప్ వాహనంతో కడపకు తిరిగి వచ్చారన్నారు. కడపకు వచ్చిన వీరు డాక్టర్ సుభాష చంద్రబోస్ ఇంట్లో బస చేసి మరుసటి రోజు అమలు చేయాల్సిన ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారన్నారు. బావలూరి చెన్నకృష్ణ, మూడే బాలాజీ నాయక్‌లు 12వ తేదీ ఉదయం 11 గంటలకు కడప నగరంలోని సిఎస్ఐ చర్చి సమీపంలోని చర్చికి వెళ్లి వస్తున్న డాక్టర్ అచ్చన్నను బలవంతంగా అపహరించి వాహనంలో రాయచోటికి తీసుకు వెళ్లారన్నారు. తనను ఎందుకు అపహరిస్తున్నారని అచ్చన్న వారిని కోరడంతో మీతో డాక్టర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడాలని అనుకుంటున్నారని, అక్కడ వున్నారంటూ చూపడంతో వాహనంలో ఎక్కి వెళ్లారన్నారు. నీ వల్ల తాను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని డాక్టర్ సుభాష్ చంద్రబోస్ అచ్చెన్నతో వాదించారన్నారు. నీకు ఉద్యోగ విషయంలో సహకరిస్తానని అచ్చెన్న సుభాష్ చంద్రబోస్‌కు చెప్పారన్నారు. అచ్చన్నతో మద్యం త్రాగించి, రాయచోటి శివారుల్లో చికెన్ తినిపించి మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో అన్నమయ్య జిల్లా రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్డుకు చేరుకున్నారన్నారు. ఆ సమయంలో అచ్చన్న మద్యం మత్తులో అపస్మారక స్థితిలో వున్నారని ఎస్పీ వివరించారు. డాక్టర్ సుభాష్ చంద్రబోస్ డాక్టర్ అచ్చన్నను బెదిరించగా, బావలూరి చెన్నకృష్ణ, మూడే బాలాజీ నాయక్‌లు చంపాలన్న ఉద్దేశ్యంతో అతని ఛాతిపై బలంగా కాలితో తన్నగా ఘాట్‌లోని రక్షణ గోడపై కూర్చొని వున్న డాక్టర్ అచ్చన్న లోయలో పడి పోయాడన్నారు. ఆ తర్వాత ఈ ముగ్గురు అక్కడి నుండి పారి పోయా రన్నారు. నిందితులు సాక్ష్యాధారాలను రూపుమాపేందుకు మృతుడి మొబైల్ ఫోన్ ను తీసుకుని, మొబైల్ ఫోన్ ను ఒక చోట, సిమ్ కార్డులను మరో చోట గువ్వల చెరువు ఘాట్ లో పారవేశారన్నారు. దర్యాప్తు సమయంలో సెల్ ఫోన్‌లో వున్న క్లూ, రాయచోటిలో చంద్రబోస్ లోకేషన్ లను బేస్ చేసి సైబర్ టీమ్ సమచారం ఇచ్చారన్నారు. దర్యాప్తులో భాగంగా రామాపురం పోలీసులు ఈ నెల 24న గువ్వలచెరువు ఘాట్ లోయలో మృతదేహాన్ని గుర్తించి విచారణ చేపట్టారన్నారు. ఈ క్రమంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం ఈ కేసులో ఏ1 అయిన డాక్టర్ సుభాష్ చంద్రబోస్, ఏ 2 బావలూరి చెన్నకృష్ణ, ఏ 3 మూడే బాలాజీ లు కడప విఆర్ఓ ఎదుట లొంగి పోయి అతని ముందు తమ నేరాన్ని అంగీకరించారన్నారు. అనంతరం విఆర్ఓ కడప వన్ టౌన్ సిఐ నాగరాజు ఎదుట హాజరు పరిచారన్నారు. నింది తులు డాక్టర్ అచ్చన్నను చంపినట్లు సాక్ష్యాలను రూపుమాపినట్లు అంగీ కరించారన్నారు. మృతుడి సిమ్ కార్డును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను జుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామన్నారు.

జీడి హత్య వెనుక ఎవరున్నా అరెస్ట్ చేయాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : డిడి హత్య వెనుక ఎవరు ఉన్న అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పశువైద్యశాల డిడి అచ్చెన్న హత్య కేసులో కడప పోలీసుల నిర్లక్ష్యమే కారణమన్నారు. డీడీ అచ్చెన్న హత్య కేసును సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలన్నారు. కర్నూలు వైద్య నిపుణులతో మృతదేహానికి రిపోస్టు మార్టం నిర్వహించాలన్నారు. కుటుంబ సభ్యులు ఈనెల 14న కడప పోలీసులకు ఫిర్యాదు చేసిన 12 రోజులు పాటు పోలీసులు స్పందించలేదన్నారు. అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు ఎక్కడున్నారని దాని పై కనీస దర్యాప్తు చేపట్టలేదన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేసిన పేర్లలో ఒకరి పేరు తొలగించాలని కడప వన్ టౌన్ సీఐ నాగరాజు బెదిరించాడన్నారు. 12వ తేదీ అచ్చన్న అదృశ్యమైతే 14న ఆయన సస్పెండ్ చేశారన్నారు. అచ్చెన్న హత్య విషయం తెలిసే ఉన్నతాధికారులు ఆయన్ని సస్పెండ్ చేశారన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసిన వారిలో ఒక్కరిని కూడా పోలీసులు విచారించలేదన్నారు.మృతదేహం లభ్యమైన తర్వాతనే హత్య కేసుగా నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. సీఎం జగన్ సొంత జిల్లాలోని దళిత ఉన్నతాధికారి ప్రాణాలకు విలువ లేకుండా పోయిందని వాపోయారు. డిడి హత్య వెనక ఎవరున్నా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులు కాపాడే ప్రయత్నం చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మాని కింద వెంకటేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఐ నాయకులు గుంటి వేణుగోపాల్ చంద్రశేఖర్, మునయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మాతయ్య వికలాంగుల రాష్ట్ర కన్వీనర్ చిన్న సుబ్బయ్య యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే రాహుల్ గాంధీని

ఎంపీ పదవి నుండి తొలగించారు

మాజీ జాతీయ ఎస్సీ కమిషనర్ మెంబర్ కమలమ్మ



విశాలాంధ్ర-పోరుమామిళ్ల : రాజకీయ కక్షతోనే రాహుల్ గాంధీని ఎంపీ పదవి నుండి తొలగించారని మాజీ జాతీయ ఎస్సీ కమిషనర్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, ఏపీసిసి వైస్ ప్రెసిడెంట్ జె. ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేవలం ఆదాని అవినీతిని ప్రోత్సహిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పార్లమెంటులో రాహుల్ గాంధీని ఎదుర్కొనే ధైర్యం లేక కుటీలమైన రాజకీయనికి పాల్పడ్డారు. ప్రజాస్వామ్యాన్ని న్యాయవ్యవస్థను కాంగ్రెస్ పార్టీ మరియు పార్టీ నాయకులు ఎప్పుడు గౌరవిస్తూ ఉండడం ద్వారానే దేశంలో ఇంతవరకు ప్రజాస్వామ్యం కాపాడుకుంటూ వచ్చాము అన్నారు. కోర్టు శిక్షను అప్పీలు చేసుకునే అవకాశం గౌరవ న్యాయస్థానం కల్పించినప్పటికీ ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా రాహుల్ గాంధీని పై వేటు వేయడం కుట్రపూరిత చర్య అన్నారు. ఒక కాంగ్రెస్ పార్టీనే కాకుండా వివిధ ప్రతిపక్ష పార్టీ నాయకులు కూడ ఖండిస్తున్నారు. వారికి మద్దతు పలుకుతున్నారు దేశ ప్రజలందరూ కూడా ముక్తకంఠంతో ఈ చర్యను ప్రజాస్వామ్య విలువలను కాపాడుటకు ప్రజలందరి మద్దతు ఇవ్వవల సిందిగా మనవి చేస్తున్నారు. బిజెపి ప్రభుత్వ కక్షపూరిత చర్యకు ఖండిస్తూన్నారు.

మీ పార్టీ ఎమ్మెల్యేలు మిమ్మల్ని అసహ్యించుకుంటున్నారు



విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఎమ్మెల్యేలు నాయకులారా ఇప్పటికైనా మీరు కళ్ళు తెరవండి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆనం నారాయణరెడ్డి, ఉండవల్లి శ్రీదేవి ఇలాగ ఎంతోమంది ఎదురు తిరగలేక వాళ్ళ మనసులో వాళ్లే కుమిలిపోయే వాళ్ళు ఎంతోమంది ఉన్నారు. ఇప్పటికైనా వాళ్లను చూసి మీరు మేల్కొండి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆనం నారాయణరెడ్డి కన్నా పెద్ద రాజకీయ నాయకులు వైసీపీలో పెద్దగా ఎవరు లేరు అంతటి వారే జగన్ చేస్తున్న అరాచకాలు చూడలేక అధికారం ఇంకా ఒక సంవత్సరం ఉన్న బయటకు వచ్చారంటే మిగతా వాళ్ళు తెలుసుకోండి ఎమ్మెల్యేలు అయ్యేది జగన్ కోసం కాదు ఆయన శాడిజం కోసం కాదు ప్రజల కోసం రాష్ట్రం కోసం కనుక మా బాధ ఏం లేదు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తుంటే అక్కడ ఉండి మీరు ఏమి చేయలేక ఎదురు మాట్లాడలేక కుమిలి కుమిలి మీరు మీరే ఏడ్చుకునే బదులు బయటకు వచ్చి స్వేచ్ఛగా తప్పును తప్పుగా చెప్పి మళ్ళీ మీరు మీ ప్రజల ముందుకు పోయేకి అవకాశం కల్పించుకోండి మీరు ఇలానే ఉంటే రేపు ప్రజలు మిమ్మల్ని ఊర్లో కి కూడా అడుగు పెట్టనివ్వరు గుర్తుపెట్టుకోండి అని టీడీపీ నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య హితవు పలికారు. రాజధాని ఎక్కడంటే ఏమని చెప్తారు, పోలవరం ఎంతవరకు వచ్చింది అంటే ఏమి చెప్తారు, మద్యం నిషేధించారా అని అడిగితే ఏం చెప్తారు, వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేశారా అని అడిగితే ఏం చెప్తారు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో విషయాలు ప్రజలు మిమ్మల్ని అడుగుతే ఏమి చెబుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీసీ జిల్లా ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి, నాయకులు నాదెళ్ల బాబాయ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెమోలు వెనక్కి తీసుకోవాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు



విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: కమలాపురం సెక్షన్ పందిళ్లపల్లి విద్యుత్ ఏఎల్ఎమ్‌గా పనిచేస్తున్న డి.విజయశేఖర్‌కు సంబంధంలేని 11కేవి 17పోల్స్ అక్రమంగా తీశారని, మరొక ప్రదేశంలో నిర్మించారని మెమోను ప్రొద్దుటూరు ఎక్సిక్యూటివ్ ఇంజనీర్ పేరుతో ఎర్రగుంట్ల ఏఈఈ ఎల్.నరసింహారెడ్డి కార్యాలయంలో గత ఫిబ్రవరి 28వ తేదీపై ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, విజయశేఖర్‌కు మెమోను మార్చి 25వ తేదిన ఇచ్చారని దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అసలు దోషులను శిక్షించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, ఏపీ ఎలక్ట్రిసిటి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య, రీజనల్ ప్రెసిడెంట్ లక్ష్మినారాయణలు ప్రొద్దుటూరు ఎక్సిక్యూటివ్ ఇంజనీర్ విద్యుత్ కార్యాలయంలో ఈఈ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పందిళ్లపల్లి నుండి విద్యుత్ 11కేవి 17పోల్స్ లైన్‌కు సంబంధించి కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు భారతీ సిమెంట్ ఫ్యాక్టరీ బ్యాక్ సైడ్ డంప్ యార్డ్ వరకు అక్రమంగా 16పోళ్లకు లక్షలు అయ్యే ఎలాంటి చార్జీలు విద్యుత్ సంస్థకు డబ్బులు చెల్లించకుండా షిఫ్ట్ చేసి కనెక్షన్ ఇచ్చారని విజిలెన్స్ అధికారులు, వర్క్‌మేన్ ఉద్యోగులను విచారణ చేస్తున్నారన్నారు. ఏఎల్ఎం డి.విజయశేఖర్‌కు ఇచ్చిన మెమో రీకాల్ చేయాలని లేనిపక్షంలో ఏఐటీయూసీగా మొత్తం ఏపీఏ స్టాఫ్ అండ్ వర్కర్స్‌తో సమిష్టిగా ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమములో ఏఐటీయూసీ పట్టణ నాయకులు హరి, ఆదినారాయణ రెడిడ,బాధితుడు డి.విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొప్పర్తి నందు బండలాగుడు పోటీలు

విశాలాంధ్ర - కడప కలెక్టరేట్ : ఈనెల 30వ తేదీన కొప్పర్తి పంచాయతీ కొప్పర్తి గ్రామం నందు కోదండరామ స్వామి దేవస్థానం నందు శ్రీ రామనవమి సందర్భంగా, స్వామి వారి కళ్యాణం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, యువ నాయకుడు చింతకొమ్మదిన్నె జెడ్పిటిసి నరేన్ రెడ్డి పాల్గొంటారని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. తదుపరి అన్నదాన కార్యక్రమంకు సహకరించిన దాతలు,స్వర్గీయ కందుల శివానందరెడ్డి కుమారుడు కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), శనివారపు శంకర్ రెడ్డి కుమారుడు వెంకట శివారెడ్డి(బాబు) సహకరించారని, అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుండి సీనియర్ వృషభరాజములకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని, సాయంత్రం కోలాటం కార్యక్రమం ఏర్పాటు చేశామని, బండలాగుడు పోటీలను చింతకొమ్మదిన్నె జడ్పిటిసి నరేన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని గ్రామ పెద్దలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాలతో పాటు మండలంలోని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని గ్రామ ప్రజలు కోరారు.

ఏటీఎంలో పనిచేయని ప్రింటర్లు



విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక మెయిన్‌బజారులోని భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బిఐ) ఏటీఎం గదిలో ఉన్న ప్రింటర్లు గత కొన్ని మాసాలుగా పనిచేయకపోవడంతో ఖాతాదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సహజంగా ఏటీఎం, ఫోన్‌పే, గూగుల్‌పే వంటి వాటి ద్వారా ఆర్థిక లావాదేవీలు కొనసాగించే ఖాతాదారులు అందుకు సంబందించిన వివరాలను పొందేందుకు వీలుగా ప్రింటర్లు దోహదపడతాయని అయితే అవి పనిచేయకపోవడంతో తమ లావాదేవీలకు సంబంధించిన వివరాలు తమ బ్యాంకు పాసుపుస్తకంలో నమోదు కాక సతమతమవుతున్నారు. ప్రింటర్లు పనిచేయని విషయాన్ని తెలుసుకున్నప్పటికీ వాటిని సరి చేసే ఆలోచన బ్యాంకు ఉన్నతాధికారులకు తట్టకపోవడంపై వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ఏటీఎం గదిలో ఏసి యంత్రాలు సైతం పనిచేయడం మానేశాయి. ఈ విషయాలను ఆ ప్రాంత కౌన్సిలర్ మహ్మద్‌ఆలీ బ్యాంకు అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ స్పందించకపోవడం ఇక్కడి అధికారుల పనితీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి ముఖ్యం

విశాలాంధ్ర-వేంపల్లె: పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమంతి ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటరు డాక్టర్ ఓబులరెడ్డి అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారముగా స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్‌న్ ఆధ్వర్యంలో సోమవారం క్యాంపు నిర్వహించారు. ప్రత్యేక శిబిరము ద్వారా హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాల వెనుక భాగమున ఉన్న వ్యర్థాలను విద్యార్థిని విద్యార్థులు రోడ్డుకి ఇరువైపులా వ్యర్థాలను తొలగించి పరిశుభ్రపరచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను తొలగించుట వల్ల మానవ ఆరోగ్యానికి మంచిదన్నారు. తదుపరి విద్యార్థులు హరిజనవాడలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆర్థిక సామాజిక విషయాల మీద సర్వే చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు రాజారెడ్డి, వినోద్, తేజేంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధం

విశాలాంధ్ర-చెన్నూరు : పాడిపశువులకు మేత కోసం ఓబులంపల్లె నుండి చెన్నూరులోకి ట్రాక్టరులో తీసుకువస్తున్న గడ్డి విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. ఇందుకు సంబందించి వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూరుకు చెందిన చల్లా బాలవీరారెడ్డి అనే రైతుకు పాడిపశువుల ఫామ్ ఉంది. సోమవారం ఓబులంపల్లె నుండి ట్రాక్టరులో గడ్డిని తీసుకువస్తుండగా చెన్నూరు ప్రధాన రోడ్డులోని భారతీయ స్టేట్‌బ్యాంకు దగ్గరలో ఎత్తు తక్కువలో ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి వెంటనే మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. గడ్డి అంటుకోవడం వలన పొగ ఎక్కువగా వ్యాపించడం మంటలు అదుపుకాకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపుచేశారు. కాగా కాలిన గడ్డి పశువుల మేతగా పనికిరాక ఆ రైతుకు రూ.30వేలు నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. అయితే ప్రధానరోడ్డులో డ్రైనేజీ పనులు చేస్తుండడంతో మట్టి కుప్పలు తోలారు. ఆ మట్టి కుప్పల మీద ఎక్కిన ట్రాక్టర్ విద్యుత్ తీగలు తగలడంతో మంటలు వ్యాపించాయి.

రాము మృతి కేసులో ముగ్గురు అరెస్ట్

విశాలాంధ్ర -ప్రొద్దుటూరు: ఈనెల 23వ తేది అమృతనగర్‌లో రాము అనే వ్యక్తి చనిపోయిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ యుగంధర్ బాబు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఈనెల 23వ తేది ట్రాక్టర్‌లో మట్టి తోలుకుంటూ ట్రాక్టర్ లైట్లు ఆప్ చేసుకొని వెలుతుండగా రాము ఇసుకలో నిద్రిస్తుండగా అది గమనించకుండా అతనిపై ట్రాక్టర్‌ని ఎక్కించడంతో అక్కడికక్కడే మృతి చెందారని అన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ తలారి గురుప్రసాద్, తలారి బాలుడు, చిప్ప పోలయ్యను అరెస్ట్ చేశామన్నారు. రాము భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామన్నారు. సోమవారం మధ్యాహ్నం ట్రాక్టర్ డ్రైవర్ తలారి గురుప్రసాద్, ట్రాక్టర్ యజమాని తలారి బాలుడు, చిన్న పోల య్యను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు పోలీ సులు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ సంజీవరెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జెకెసి మరియు ఐక్యూ ఏసీ ఆధ్వర్యంలో సెమినార్

విశాలాంధ్ర - మైదుకూరు : డిగ్రీ కళాశాల మైదుకూరు నందు జెకెసి మరియు ఐక్యూ ఏసీ విభాగాల ఆధ్వర్యంలో సక్సెస్ ఈస్ ఆన్ యాటిట్యూడ్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి నారాయణ రెడ్డి మాట్లాడుతూ జీవితానికి ఒక లక్ష్యం అంటూ ఉండాలి అని లక్ష్యం లేని జీవితం తెరచాప లేని నావ లాంటిది అని ఎందుకు అనగా తెరచాప ఎదురుగాలను కూడా తను కొనుకూలంగా మార్చుకొని నావను ముందుకు నడిపిస్తుంది అని తెలిపారు. లక్ష్యం లేని జీవితం ఎటు పోతుందో ఎవరికీ తెలియదు అని తెలిపారు. కావున విద్యార్థులు మంచి లక్ష్యాలు ఎన్నుకొని ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గా బెంగళూరు యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే కచ్చితంగా ఒక లక్ష్యం ఎంచుకోవడం అదేవిధంగా తాను ఎంచుకున్న లక్ష్యం కోసం తాను వేసుకున్న పునాదిలో లోపం ఉండకూడదని తెలుపుతూ వివిధ రకాల బ్యాంకుల వివరాలు మరియు వివిధ రకాల బ్యాంకులకు ఉద్యోగాల కొరకు ఎలా ప్రిపేర్ కావాలి ఏ విధంగా ప్రిపేర్ కావాలి మరియు ఆన్లైన్ అలాగే ఆఫ్లైన్ మొదల వివరాలు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాధా రామ్ మరియు, పి.చెన్నరాయుడు సుభాన్ సాహెబ్, డాక్టర్ వెంకట్రామిరెడ్డి, జి రామకృష్ణారెడ్డి అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా



పంట నష్టపరిహారం కోసం కృషి: ఎమ్మెల్సీలు

విశాలాంధ్ర-వేంపల్లె: ఇటీవల జిల్లా వ్యాప్తంగా సంబవించిన ఈదురుగాలులు, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టపరిహారం కోసం తాము కృషి చేస్తామని టీడీపీ ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, బీటెక్ రవిలు స్పష్టంచేశారు. వేంపల్లె టీడీపీ కార్యాలయంలో సోమవారం వారు ఆ పార్టీ నాయకులతో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏ మేరకు పంట నష్టం జరిగిందనే అంశంపై చర్చించారు. వారు మాట్లాడుతూ వేసవిలో అకాల వర్షాలు, పెనుగాలులు రావడం సహజమన్నారు. ఏటా ఏప్రిల్ ఆఖరు లేదా మే మొదటి వారంలో ప్రకృతి వైపరీత్యాలు సంబవిస్తాయన్నారు. ఈ దపా అవి ముందస్తుగానే ప్రవేశించడంతో రైతులకు తీవ్రనష్టం జరిగిందన్నారు. ఇప్పుడిప్పుడే తామ పంటల పరిస్థితి, జరిగిన నష్టం తదితర వివరాలను సేకరిస్తామన్నారు. రైతులకు పరిహారం చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి కూడా తీసుకొస్తామన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎప్పుడు రైతుకు నష్టం జరిగినా వెంటనే పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించేవారన్నారు. ఏది ఏమైనా రైతుకు పరిహారం అందించే వరకు తాము కృషి చేస్తామని వారు వెల్లడించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సింగారెడ్డి.ముని రెడ్డి, బొజ్జా మైసూరారెడ్డి, మైనార్టీ అధ్యక్షులు తెలంగాణ వల్లి. టౌన్ అధ్యక్షులు ఆర్వి. రమేష్, పాపిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు. వీరభద్ర. మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్. టీడీపీ నాయకులు. జబిబుల్లా. కత్తులూరు. మల్లి, ఎస్సీ ప్రధాన కార్యదర్శి. ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేవరకు పోరాటం :సిపిఐ

విశాలాంధ్ర-కడప రూరల్ : జాతీయ హెూదా కలిగిన పోలవరం ప్రాజెక్టును సామర్థ్యం తగ్గించే ఆలోచన మానుకుని పూర్తిస్థాయి నీటిమట్టంతో నిర్మించి రాయలసీమ నీటి కొరతను తీర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సిపిఐ రిలే నిరాహార దీక్షల ప్రారంభంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. నీటి వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం, కేంద్ర జలవనరుల సంఘం చేత ఆమోదం తెలపబడి 1980లో శంకుస్థాపన చేయబడి, 2005లో ప్రారంభించబడి, 2014 రాష్ట్ర విభజన చట్టంలో జాతీయ హెూదా కల్పించబడిన పోలవరం ప్రాజెక్టు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురై పూర్తికి నోచుకోకపోగా, సామర్థ్యం తగ్గించే కుట్ర జరుగుతున్నదన్నారు. పోలవరం సామర్థ్యాన్ని 150 అడుగుల నుండి 90 అడుగులకు కుదించడం వల్ల ప్రాజెక్టు నీటి సామర్థ్యం తగ్గిపోయి బ్యారేజిగా మారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అందులో రాయలసీమ ఎక్కువ నష్టపోతుందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తికి నిధుల కేటాయించడంలో నిర్లక్ష్యంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. మోడీ, జగన్ సర్కార్ ఇరువురు కలిసి రాష్ట్రాన్ని నిలువునా మోసం చేస్తున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే పోలవరం ప్రాజెక్టు పూర్తి కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్రంలో అన్ని పక్షాలను ఏకం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, ఆంజనేయులు, సి.బషీరున్నీష, సి.సుబ్రమణ్యం, ఎంవి. సుబ్బారెడ్డి, జి.వేణుగోపాల్, కే.సీ బాదుల్లా, గంగా సురేష్, సావంత్ సుధాకర్, మనోహర్ రెడ్డి, కొమ్మది ఈశ్వరయ్య, వలరాజు, వెంకట్ రాముడు, కట్టా యానాదయ్య, ఇమ్మానుయేలు, మైనుద్దీన్, ఎస్. సుబ్రహ్మణ్యం, నాగరాజు, పద్మ, పకీరప్ప, కొండయ్య, బాలచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పని ప్రభుత్వం :తుంగా

ఆసరా ద్వారా 1196 మందికి లబ్ది -రూ.10.92కోట్లు ఖాతాల్లో జమ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ ఆసరా పథకం కింద పొదుపు సంఘాల మహిళలకు రుణమాఫీ అమలు చేస్తోంది. ఇందులో భాగంగా మూడవ విడత కింద యర్రగుంట్ల పట్టణ, గ్రామాల్లో 1196 మందికి రూ.10,92,41,447 మొత్తాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో ఎర్రగుంట్ల పురపాలిక పరిధిలో 497 మంది రూ.4,15,06,975 లబ్ది పొందగా గ్రామాల్లో 699 మంది రూ.6,77,34,472 మేర ఆర్థిక లబ్ది పొందారు. 2019 ఎన్నికల నాటికి పొదుపు సంఘాల మహిళలు బ్యాంకులలో ఉన్న రుణాలను మాఫీ చేసేందుకు వీలుగా అప్పట్లో ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతల్లో ఆ మొత్తాన్ని అందించనున్నారు. అందులో భాగంగా ఇప్పటి వరకు మూడు విడతలు మంజూరు కావడం గమనార్హం. కాగా ఎర్రగుంట్ల ప్రాంతంలో 1196 మంది పొదుపు సంఘాల సభ్యులకు లబ్ది చేకూరడం పట్ల పురపాలిక 5, 6 వార్డుల కౌన్సిలర్లు తుంగా వెంకటరామిరెడ్డి, నాగిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణాల మాఫీకి నడుం బిగించడం అభినందనీయమన్నారు. మాట తప్పని వైసీపీ ప్రభుత్వానికి మహిళలు బాసటగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు.

నాలుగేళ్ల తరువాత పల్లె రోడ్డు గుర్తొచ్చిందా..?

శివాల్‌పల్లె వద్ద రూ.57లక్షలతో సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమిపూజ

విశాలాంధ్ర-చెన్నూరు : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో ఎప్పుడో వేయాల్సిన సిమెంటు రోడ్డును ఆ నిధులే లేకుండా చేసి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శివాలపల్లె గ్రామానికి సిమెంటు రోడ్డు వేసేందుకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ చేయడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎన్నో ఏళ్లుగా మండలంలోని శివాలపల్లె హరిజనవాడ నుండి ప్రధాన గ్రామానికి సిమెంటు రోడ్డు లేదు. మట్టిరోడ్డులోనే ప్రజలు అష్టకష్టాలు పడి ప్రయాణాన్ని సాగిస్తున్నారు. సుమారు 710 మీటర్లకు పైగా ఉన్న ఈ మట్టిరోడ్డులో వర్షాకాలం రాకపోకలు సాగించాలంటే ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. ఎన్నోమార్లు ఈ దారి గురించి ప్రజాప్రతినిధులకు ఆ గ్రామ ప్రజలు చెప్పడం జరిగింది. మరో ఏడాదిలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎమ్మెల్యే రూ.57లక్షలతో ఈ గ్రామానికి సీసీ రోడ్డు వేస్తారని సోమవారం భూమిపూజ చేశారు.కాగా ఎలాంటి అభివృద్ధి పనులు మండలంలో జరిగినా నిధులు రావడం ఎంతో ఆలస్యమవుతున్న తరుణంలో సిమెంటు రోడ్డు కూడా పూర్తి చేస్తారా మధ్యలోనే ఆపేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కొద్దిరోజులు పోతే కానీ తెలియదని ఆ గ్రామ ప్రజలు చెప్పుకుంటున్నారు.

కొనసాగుతున్న వేలంపాట వాయిదాపర్వం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక పురపాలిక దినసరి మార్కెట్ వేలంపాట ముచ్చటగా మూడోసారి వాయిదా పడడమే కాకుండా పూర్తిగా రద్దు కావడం గమనార్హం. తొలుత ఈ నెల 24వ తేదీన బహిరంగ వేలంపాటకు ఆహ్వానించగా ఇరువురు కాంట్రాక్టర్లు మాత్రమే అందుకు సంబంధించి సిద్ధమయ్యారు. సర్కారు పాట రూ.15,33,700లుగా ఉండడంతో వారు మౌనం దాల్చారు. ఫలితంగా పాటను 25వ తేదీకి వాయిదా వేశారు. తిరిగి 25వ తేదీ కూడా ఇదే పరిస్థితి నెలకొనగా 27వ తేదీకి వాయిదా పడింది. 27వ తేదీ సోమవారం మున్సిపల్ కమీషనర్ పగడాల జగన్నాథ్ ఆధ్వర్యంలో వేలంపాట ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ సర్కారు వారి పాట మొత్తం రూ.15లక్షలకు పైబడి ఉండడంతో కాస్త విముఖత చూపారు. దీంతో పాట ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం కమీషనర్ విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడి పరిస్థితిని ఆర్డీకి నివేదిస్తామన్నారు. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం ప్రక్రియను తిరిగి చేపడుతామన్నారు. ఇదిలా ఉండగా గేటు వసూళ్ల మొత్తం రూ.10లక్షల వరకు అయితే కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే అవకాశం ఉంది. పురపాలిక అధికారులు నిబంధనలను సాకుగా చూపుతూ రూ.15లక్షలకు పైబడి పెంచడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జగన్ ప్రభుత్వంలో వైద్యరంగానికి పెద్దపీట

ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం దేశానికే ఆదర్శం - ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్‌బాష

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో వైద్యరంగానికి పెద్దపీట వేసి పేద బడుగు బలహీనవర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద 104 వాహనాలను ఆయన లాంఛనప్రాయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడి సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ జరుగుతోందని, గతంలో దివంగత సీఎం వైఎస్ఆర్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని మెరుగుపరుస్తూ ముందుకు వెళుతున్నారన్నారు. గతంలో 1004 వ్యాధులకు మాత్రమే చికిత్స ఉండేదని ప్రస్తుతం 3400 పైచిలుకు వ్యాధులను జోడించడం పేద ప్రజలకు వైద్యం అందించడం జరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం తీసుకురావడం జరిగిందని ప్రతి మండలానికి రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎంబిబిఎస్ డాక్టర్ ఉండే పరిస్థితి ఉండేది కాదని, కానీ ప్రస్తుతం ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు ఎంబిబిఎస్ డాక్టర్లను నియమించారని ఆ ఇద్దరు డాక్టర్లలో ఒక డాక్టర్ 104 వాహనం ద్వారా మండలంలోని క్షేత్రస్థాయిలో గ్రామాలకు టైంటేబుల్ ప్రకారం వెళ్లడం జరుగుతోందని, గ్రామాలలో వెళ్లి ఇంటి వద్దనే వైద్యం అందించడం జరుగుతోందని అన్నారు. మరో డాక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉండడం జరుగుతోందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం జరుగుతోందని చెప్పారు. ఈ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని ముఖ్యమంత్రికి మీ అందరి ఆశీస్సులు దీవెనలు ఇదేవిధంగా కొనసాగాలని ప్రతి ఒక్కరిని పేరుపేరునా అభ్యర్థించడం జరుగుతుందన్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.నాగరాజు, అదనపు డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ ఉమామహేశ్వరరావు, 104 వాహనం జిల్లా మేనేజర్ వెంకట సుబ్బయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్యయాదవ్, కార్పొరేటర్ అజమతుల్లాఖాన్, వైకాపా నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్ఆర్ఐ తోటకృష్ణ, అహమ్మద్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య హక్కు అమలుకు చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ఈ విద్య సంవత్సరం నుండి ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య హక్కు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్లో.. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల కుటుంబాల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య హక్కు అమలుకు సంబందించి.. ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, విద్యాశాఖ అధికారులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 121 ప్రకారం 25శాతం సీట్లు సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లల కొరకు ప్రైవేట్ అండ్ స్కూళ్లలో రిజర్వ్ చేయబడ్డాయన్నారు. తద్వారా వారికి అడ్మిషన్ ఉచితంగా అందనుందన్నారు. మార్చి 22, 2023 నుంచి ఏప్రిల్ 10, 2023 వరకు 5 నుంచి 6 సంవత్సరాల వయసు ఉన్న విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. వార్డు గ్రామ సచివాలయంలో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చందు, జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : నేడు 28వ తేదీ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, కడప జడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిలు తెలిపారు. ఉదయం 09 - 30 గంటలకు ఒంటిమిట్ట మండలంలోని మండల కార్యాలయం నందు ఒంటిమిట్ట మండల సర్వసభ్య సమావేశం కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే ఉదయం 10 - 30 గంటలకు ఒంటిమిట్ట మండలంలోని వెలుగు ఆఫీస్ ఆవరణం నందు ఒంటిమిట్ట మరియు సిద్దవటం మండలంకు సంబంధించి వైయస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, మండల జేసీఎస్ ఇన్చార్జులు, మండలంలోని ముఖ్య నాయకులు వైఎస్ఆర్సిపి పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలి

విశాలాంధ్ర-కొండాపురం: దళితుల ఆరాధ్య దేవుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం కొండాపురంలోని సర్వే నెంబర్ 203నందు స్టేట్ బ్యాంక్ సమీపంలో దళితులు ఎక్కువగా ఉన్నందువల్ల ఆ ప్రాంతంలో ఏర్పాటుచేయాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు తహసీల్దార్ శోభన్‌బాబుకు వినతిపత్రం అందచేయాలని వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో రోజులుగా విగ్రహం ఏర్పాటుచేయాలని కోరుతున్న, అధికారులకు వినతిపత్రం అందచేస్తున్న స్పందించడం లేదని, ఆయన కేవలం దళితుల కోసమే కాకుండా ప్రతి ఒక్కరికి ఆదర్శం అని ఆయన దేశానికి చేసిన సేవలను కొనిఆడారు. అలాంటి ఆ మహనీయుడు విగ్రహం ఏర్పాటుచేయాలని కోసం పోరాటం చేయాల్సి రావడం దారుణం అని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని లేనిఎడల ఆందోళన చేస్తామని తెలిపారు.

ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయండి

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: అన్ని రకాల పంటలకు మద్దతు ధరలు అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, అసంఘటిత కార్మికు లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 5వ తేదిన ఛలో డిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని సోమవారం బ్రహ్మంగారి మఠం మండలంలోని సుందరయ్య భవణంలో గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంపద అంతా పెట్టుబడిదారులు, కార్పోరేట్లకు దోచిపెడుతుందని, దేశ ప్రజలపై మరింత పన్నుల భారం మోపి మధ్య తరగతి, సామాన్య ప్రజలు జీవించలేని స్థితికి నెట్టివేసిందని అన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని, రైతు హక్కులను చట్టాలను నిర్వీర్యం చేస్తుందని అన్నారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ పనులను ప్రారంభించాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 5న ఛలో డిల్లీ కార్యక్రమంకు రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఐటీ యూ నాయకులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్, రెబ్బ నరసింహా, భాస్కర్, జయరాములు, మల్లయ్య, బ్రహ్మయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ మూడోవిడత ఆసరా : ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హాజరు

విశాలాంధ్ర-అట్లూరు : డ్వాక్రా మహిళలు అప్పు చేస్తే జగనన్న మీ అప్పును చెల్లిస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డా.సుధలు పేర్కొన్నారు. సోమవారం అట్లూరు మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనం ఆవరణంలో ఎంపీపీ కొత్తపు రమాదేవి, స్థానిక సర్పంచ్ ఎల్లమ్మల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ మూడవ విడత ఆసరా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక్క గ్రూపుకు గరిష్టంగా సీఎం జగన్ రూ.10లక్షల వరకు రుణమాఫీ చేశారన్నారు. ప్రభుత్వం జగనన్న ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. అట్లూరు మండలంలో 2019 నాటికి 438 స్వయం సహాయక గ్రూపులు ఉంటే 2023 మార్చి నాటికి 110 గ్రూపులు అదనంగా చేరాయన్నారు. డీపీటీ ద్వారా ప్రభుత్వం లక్ష90 వేల కోట్లు నేరుగా లబ్దిదారులకు చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఫారెస్టు డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, మండల వైసీపీ నాయకుడు పోతిరెడ్డి రెడ్డయ్య, మాజీ జడ్పీటీసీ అందూరి రామకృష్ణారెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధ్యక్షుడు ఆర్.మాధవరెడ్డి, డీలర్ కృష్ణారెడ్డి, వరికుంట సర్పంచ్ రమణ, అగ్రహారం నరసారెడ్డి, ఈరి గోపాల్, కొత్తపు నరసింహ, రాజా, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో దళితులకు పెద్దపీట

- సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : వైసీపీలో దళితులకు పెద్దపీట వేశారని ఏ కులానికి ఇవ్వని ప్రాధాన్యత ఎస్సీలకు ఇచ్చారని సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ అన్నారు. సోమవారం వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉండవల్లి శ్రీదేవి క్రాస్ ఓటింగ్ పాల్పడిందని ఆమెతో పాటు మరో ముగ్గురిని పార్టీ అధిష్టానం సస్పెండ్ చేసిందని ఉండవల్లి శ్రీదేవి మాత్రం దళితులమని మాపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారనడం బాధాకరమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులకు పెద్దపీట వేస్తూ ఉపముఖ్యమంత్రి స్థానంతో పాటు హెూం మంత్రి పదవులు కూడా ఇచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డిదేనన్నారు. దళితులకు పార్టీ అన్ని విధాల అధికారాలు ఇచ్చిందని ఉండవల్లి శ్రీదేవి ప్రెస్ మీట్ పెట్టి నా వద్ద డబ్బులు ఉన్నాయని నాకు టికెట్ ఇచ్చారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డాక్టర్ వృత్తిలో ఉన్న ఆమెను దళితురాలని గుర్తించి పిలిచి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని వైసీపీ పార్టీలో ఎంతో గౌరవం ఇచ్చినప్పటికీ గౌరవాన్ని కాపాడుకోకుండా చంద్రబాబు కాళ్ల వద్ద తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో 26వ డివిజన్ ఇంచార్జ్ త్యాగరాజ్, వినోద్ కుమార్, సంపత్ కుమార్, లక్ష్మీనారాయణ, శ్యాంసన్, సునీల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బెదిరింపులకు భయపడేది లేదు

విశాలాంధ్ర-కమలాపురం : స్థానిక రైల్వే గేట్ సమీపంలోని తెలుగుదేశం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర టిడిపి బలిజ సంఘం నాయకులు హరిప్రసాద్ మాట్లాడుతూ ఆ పార్టీ నుండి నీలం ప్రమీల నరేంద్రాను ఎమ్మెల్యే వారి అనుచరులు డబ్బులు కట్టాలంటూ వేధిస్తున్నారనడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి విధానాలు నచ్చి కౌన్సిలర్ నీలం ప్రమీల, నరేంద్ర తమ పార్టీలోకి చేరడం సంతోషమన్నారు. ఇది జీర్ణించుకోవాలని ఎమ్మెల్యే వారి అనుచరులు ఏదోరకంగా నరేంద్రను ఇబ్బంది పెట్టాలని ఉద్దేశంతో అతని మానసికంగా వేధించి వైసీపీలో చేరాలని ఒత్తిడి చేయడం పట్ల కాపులంతా ఆగ్రహంగా ఉన్నామన్నారు. కడప మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్. గంధం మోహన్ బాబు మాట్లాడుతూ తమ నాయకుడు పుత్తా నరసింహారెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి తమ కుటుంబ సభ్యులను కాదని బలిజ సంఘానికి తగిన గుర్తింపు ఇచ్చారన్నారు. నాకు కడప మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని అప్పట్లో ఇవ్వడం పుత్తా నరసింహారెడ్డి నిబంధతకు నిజాయితీకి నిదర్శనం అన్నారు. రాష్ట్ర కాపు సంఘం నాయకులు కొండాయపల్లె మల్లేష్, నియోజకవర్గ కాపు ప్రచార కమిటీ నాయకులు దాది రామయ్య తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్త బలిజ సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీకు అనర్హత వేటు వేయడం దుర్మార్గం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: రాహుల్ గాంధీకు లోక్‌సభ సభ్యత్వానికి అనర్హత వేటు వేయడం వల్ల బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యంలో భ్రష్టు పడుతున్నదని కాంగ్రెస్ పార్టీ నియోజికవర్గ ఇంచార్జ్ నజీర్ ఆహ్మద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నజీర్ ఆహ్మద్ మాట్లాడుతూ మనదేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అన్నారు. బీజేపీకి కక్ష రాజకీయాలు మితిమీరిపోతున్నాయని, భావి భారత ప్రధాని రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దుచేయడం దుర్మార్గం అన్నారు. బీజేపీ నాయకులకు రాహుల్ ఫోబియా వెంటాడుతోందని ఇది ఒక చీకటి రోజు అని అన్నారు. బీజేపీ నాయకుల తాటాకు చప్పుళ్లకు కాంగ్రెస్ పార్టీ భయపడదు అన్నారు. అంతిమ విజయం కాంగ్రెస్ పార్టీదే అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో అబ్దుల్ దాదాఖాన్, రఫీ, విజయ్‌బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొండపై గంజాయి ప్రభుత్వం ఎటు పోతుంది

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఎంతో ప్రసిద్ధిగాంచిన ఏడుకొండలు పుణ్యక్షేత్రమైన తిరుమలలో గంజాయి చలివిడిగా విస్తరిస్తుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్ప గారి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలోని ప్రసిద్ధిగాంచిన తిరుమలను అపవిత్రం చేస్తున్నారని విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు జరుగుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందని దీని వల్ల యువకులు, విద్యార్థులు గంజాయి మత్తులో తూగడం వల్ల ఎన్నో అనర్థాలు ఎదురవుతాయని తెలిపారు. దీనిపై పత్రికలు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం అయిన మేము ఏకతాటిగా ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం అధికారులు చోద్యం చూస్తున్నారని దుయ్యబట్టారు. గంజాయి మత్తుమందు వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని తెలిపారు. గంజాయి అమ్మకంపై కొండమీద జరుగుతున్న అక్రమాలపై కమిటీ వేసి బాధ్యులను శిక్షించాలని కోరారు.

పీఎమ్ కిసాన్ కోసం ఈకేవైసీ తప్పనిసరి

విశాలాంధ్ర-తొండూరు: ప్రధానమంత్రి సమ్మాన్ కిసాన్ కోసం ఈకేవైసీ తప్పని సరి అని వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పీఎమ్ కిసాన్ పథకం కింద లబ్దిపొందేవారు ఇంకా చాలా మంది రైతులు ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. ఆ మండల వ్యాప్తంగా 1380 మంది రైతులు ఉన్నారన్నారు. గ్రామాల వారిగా ఈకేవైసీ చేయించుకోని వారి వివరాలను వెల్లడించారు. తొండూరు - 118, ఇనగలూరు - 162, తేలూరు - 127, సంతకొవ్వూరు- 204, ఆగుడూరు- 14, మల్లెల - 147, బూచుపల్లె- 21, బద్రం పల్లె - 5, మెదురు -57. గంగ్లమడుగు - 114, సైదాపురం - 20, జలపర్తి - 22, గోటూరు- 28, యాదవ కుంట -79, తిమ్మాపురంపేట - 53, పాలూరురు -82. చొప్పున ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ సమాచారాన్ని రైతు గ్రూపులలో, వాలంటీర్ గ్రూప్‌లలో పంపించామన్నారు. రైతు సోదరులు వెంటనే మార్చి 31వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోగలరని కోరారు.

దోమల నియంత్రణ - మనందరి బాధ్యత

విశాలాంధ్ర-వేముల: వేముల గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి, నిల్వలున్న నీటిలో నీటి తొట్టెలలో అబేట్ పిచికారీ చేసినట్లు మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. సిద్దయ్య మాట్లడుతూ నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే పులివెందుల ఏరియా హాస్పిటల్ లో రక్తపరీక్షలు చేయించుకుని ఆ తర్వాత వ్యాధి నిర్ధారణ అయిన తరువాత మందులు వాడాల్సి ఉంటుందన్నారు. కాగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సిద్దయ్య అన్నారు. ఈ కార్యక్రమములో హెల్త్ సూపర్ వైజర్ శారదమ్మ, ఆరోగ్య కార్యకర్త అశ్వనీ, ఆశా కార్యకర్త శివమ్మ పాల్గొన్నారు.

నేత్రాలను దానం చేసిన గంగమ్మ

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల మున్సిపల్ పరిధిలోని పెద్దరంగాపురంలో కంబటి గంగమ్మ (75) శుక్లపటాలను (కార్నియాలు) దానం చేశారు. ఆదివారం రాత్రి మరణించిన గంగమ్మ శుక్లపటాలను దానం చేసేందుకు ఆమె కుమారులు శ్రీరాములు, లక్షుమయ్య, శ్రీనివాసులు, గంగులయ్య, పెద్ద గొపాలు, చిన్న గోపాలు, కుమార్తె లక్ష్మీదేవి, మనవడు భార్గవ్‌లు అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్రనిధి అధ్యక్షులు రాజుకు సమాచారం ఇవ్వడంతో నేత్రనిధి టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి స్వగృహం వెళ్లి పార్థివ దేహం నుండి శుక్లపటాలను సేకరించి వాటిని హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపినట్లు సేవా సమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు సేవాసమితి పట్టణ అధ్యక్షులు మహమ్మద్ రఫీ సభ్యులు చాంద్ బాషా, రాఘవేంద్ర రెడ్డి, నరసింహ తదితరులు అభినందనలు తెలిపారు.

ఈద్గా మైదానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర -ప్రొద్దుటూరు: ప్రొద్దు టూరు మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో ఈద్గా కాంపౌండ్ మైదానాన్ని సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి రిబ్బన్ కటింగ్‌చేసి ప్రారంభించారు. పెద్దశెట్టిపల్లె గ్రామంలో ముస్లింలు అత్యంత పవిత్రంగా నమాజ్ చదువుకునేందుకు ఈద్గా మైదానాన్ని దాదాపు రూ.10లక్షల వ్యయంతో పూర్తి చేయిస్తామని అన్నారు. ముస్లింలకు ఈ మైదానం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ బండి సుధాకర్‌రెడ్డి, 11వ వార్డు ఇంచార్జ్ కసిరెడ్డి మహేశ్వర రెడ్డి, వైకాపా నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

సెల్ టవర్‌ను తొలగించాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరం 50 డివిజన్ లోని రుకవారిపల్లెలో నీ హరిజనవాడలో అనుమతి లేకుండా సెల్ టవర్ నియమిస్తున్నారని దానిని వెంటనే తొలగించాలని టిడిపి కార్యవర్గ కార్యదర్శి హరి ప్రసాద్ సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం జరుగుతున్న గ్రీవెన్స్ సెల్ లో కమిషనర్ కు స్థానికులతో కలిసి వినతి పత్రం ఇచ్చారు ఈ సందర్భంగా ఆయన కమిషనర్ తో మాట్లాడుతూ గతంలో సాయి పేటలో సెల్ టవర్ ఏర్పాటుకు సిద్ధపడగా అక్కడివారు వారించడంతో దగ్గరలోని హరిజనవాడలో సెల్ టవర్ నిర్మాణం చేపట్టారని అనుమతి లేకపోయినా నిర్మించడం ఎంతవరకు సబబని అన్నారు. అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పర్మిషన్ రాకముందే కట్టుకునేందుకు సహాయపడుతున్నారని తెలియజేశారు. సెల్ టవర్ రేడియేషన్ తో వృద్ధులు పిల్లలు అనారోగ్యపాలు అవుతున్నారని కాబట్టి టవర్ ను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో కమిషనర్ అధికారులతో వెంటనే సెల్ టవర్ ను తొలగించాలని అలాగే వారిపై కఠిన చర్యలు తీసుకుని జరిమానా విధించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో 50 డివిజన్ ఇంచార్జ్ చంద్రబాబు, స్థానిక నాయకులు మోహన్, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

అన్నమయ్య జిల్లా

ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలి :సిపిఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గం పుల్లంపేట మండలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా రాజకీయ అండదండలతో దౌర్జన్యంగా కబ్జాదారులు ఆక్రమంగా ఆక్రమించుకున్న భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని నిరుపేద దళితులకు పంచాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం సిపిఐ పుల్లంపేట మండల కార్యదర్శి రాజబోయిన సెల్వం కుమార్ అద్వర్యంలో బాధితులతో కలిసి ఇంచార్జి తాహశీల్దారు ప్రసన్న కుమారికి, ఆర్ఐ నవీన్ లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ పుల్లంపేట మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో భూమి,ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారన్నారు. దినసరి కూలీ పనులు చేసుకుంటూ కనీసం పిల్లలను చదివించుకోలేని దుస్థితిలో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారన్నారు.వీరికి 8 విడత అసైన్మెంట్ కమిటీ సమావేశంలో బంజరు భూములను మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు భూములు మంజూరు చేయని పక్షంలో బాధితులకు అండగా నిలబడి సంబంధిత కార్యాలయాలు వద్ద రిలే నిరాహారదీక్షలు చేపడుతామని అధికారులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఐ నాయకులు ఎస్.పెంచలయ్య, ఎ.చంద్ర, ఎస్.సుబ్రమణ్యం, ఎం.బిందుప్రియ, సి.కామాక్షమ్మ, సి.సుబద్రమ్మ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వివేకానంద రెడ్డి హత్య కేసులో దోషులను శిక్షించాలి:బత్యాల

కేసు నుంచి తప్పించుకోవడానికే జగన్ రెడ్డి ఢిల్లీ చెక్కర్లు

విశాలాంధ్ర-రాజంపేట : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దోషులను సిబిఐ బయటపెట్టిందని వారికి వెంటనే శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి బత్యాల చెంగల రాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన టిడిపి శ్రేణులతో కలిసి మార్కెట్, బండ్రాళ్ల వీధి తదితర ప్రాంతాలలో పర్యటించి వివేకానంద రెడ్డి హత్య కేసు పై ముద్రించిన "జగనాసుర రక్త చరిత్ర" పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ గతంలో రాష్ట్ర పోలీసులు పై విశ్వాసం లేదని, విచారణకు సిబిఐ ని కోరిన జగన్ రెడ్డి బాబాయ్ కేసులో సిబిఐ అవసరం లేదని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఆరు సార్లు ఎంపీ గా, నాలుగు దఫాలు ఎమ్మెల్యేగానూ, ఒకమారు ఎమ్మెల్సీ గా రాష్ట్రానికి సేవలందించి ప్రజాభిమానాన్ని చూరగొన్న వివేకానంద రెడ్డిని అత్యంత కిరాతకంగా హత్య చేసినా నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వం జాప్యం చేస్తూ దోషులను వెనకేసుకురావడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయిన వివేకా కుమార్తె సునీత హైకోర్టు ద్వారా సిబిఐ ని ఆశ్రయించి న్యాయం కోసం పోరాడుతుంటే దోషులను తప్పించేందుకు జగన్ రెడ్డి ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారని విమర్శించారు. దోషులకు శిక్ష పడేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టకపోతే హత్య కేసులో జగన్ రెడ్డి ప్రమేయం కూడా ఉందని అనుమానించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు, మండల అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, టిడిపి ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్ కుమార్, సంజీవరావు, డి ఆర్ ఎల్ మనీ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్ గడువు పొడగించాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:త్వరలో జరగబోయే ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కోసం మూడు నెలలు అదనంగా సమయం కేటాయించాలని తెలుగుదేశం పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం నాడు స్పందన కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ పి.ఎస్ గిరీషా ఐఏఎస్ గారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పోలి శివకుమార్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏపీపీఎస్సీ కార్యాలయం ముట్టడించేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష క్వాలిఫై ఆయన అభ్యర్థులు ప్రిపరేషన్ కోసం కనీసం అంటే 85 రోజులు గడువును మాత్రమే ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు కటారి శివా యాదవ్,నియోజకవర్గ అధ్యక్షులు నీలం దేవేంద్ర ప్రసాద్, నియోజకవర్గ నాయకులు సుధాకర్,అనిల్,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు రెవెన్యూ అధికారుల కలకలం - భయాందోళన గురైన గ్రామస్తులు

విశాలాంధ్ర-రామసముద్రం: పోలీసు రెవిన్యూ అధికారులు ఉదయం ఆరు గంటలకే రావడం కలకలం రేపింది ఒకేసారి పెద్ద సంఖ్యలో పోలీసులు రెవెన్యూ అధికారులు రావడంతో గ్రామస్తులు భయాందోళనకు గురైనారు ఈ సంఘటన అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం లో సోమవారం జరిగింది మండలంలోని మినికి పంచాయతీ శ్రీరామపురం గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి గ్రామంలోని ఒడిసిలమ్మ ఆలయానికి దారి కావాలని రెవిన్యూ అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు అధికారులు తెలిపారు దీంతో రామసముద్రం తహసిల్దార్ దైవరాజన్ పదిమంది వీఆర్వోలు నలుగురు సర్వేలు వీఆర్ఏలు 34 మంది పోలీసులు ఇద్దరు ఏఎస్ఐలు ఒక ఎస్సై తో కలిసి ఉదయం ఆరు గంటలకే జెసిబి తో వెళ్లారు శ్రీరామపురం గ్రామం మధ్యలో దారి చేసేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు చిన్న పెద్ద తేడా లేకుండా అడ్డుకున్నారు ఇంత ఉదయం పూట కొంపలుమునిగిపోయినట్లు తహసిల్దార్ ఎందుకు అత్యుత్సాహం చూపుతున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు ఇప్పటికే గ్రామం నుండి ఆలయానికి సొంత భూముల్లో దారి ఏర్పాటు చేసినట్లు తెలిపారు దారి చూడాలని సూచించారు దీంతో ఎస్ఐ రవీంద్ర బాబు తాసిల్దార్ దైవరాజన్ ఆర్ ఐ నాగరాజ దారి పరిశీలించి దారి ఉన్నట్లు మదనపల్లి ఆర్డీవో మురళికి వాట్సప్ లో ఫోటో పంపారు దీంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగిందని దైవరాజన్ తెలిపారు గ్రామస్తులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రెవెన్యూ అధికారులు తమపై ఇలాంటి దారుణాలకు ఒడి కట్టడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు అన్నమయ్య జిల్లా కలెక్టర్ పి ఎస్ గిరీష స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు

పోలీసు ప్రధాన కార్యాలయంలో స్పందన కార్యక్రమం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నందు 'స్పందన' కార్యక్రమము నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన తమ సమస్యలను స్వయంగా జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఎస్పీ వారి సమస్యలు క్షుణంగా విని, పిర్యాదులను పరిశీలించి సంబందిత పోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి, భాదితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసు స్టేషన్ ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదని, పోలీస్ అధికారులే స్వయంగా బాదితుల వద్దకు వెళ్ళి ఆ ప్రదేశంలో విచారించి సకాలంలో చట్టపరిధిలో పిర్యాదుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చెయ్యాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణిత గడువులోపు పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలతో 63 మంది ఫిర్యాదుదారులు జిల్లా ఎస్పీకి వారి సమస్యలు విన్నవించుకున్నారు.

రాయచోటి మున్సిపల్ కమీషనర్‌గా గంగాప్రసాద్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పురపాలిక కమీషనర్ గా గంగాప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం అయనకు మున్సిపల్ కార్యలయం కమీషనర్ ఛాంబర్ లో ఇప్పటివరకు కమిషనర్ గా వున్న రాంబాబు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ రాంబాబు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమీషనర్ గా బదిలీ అయ్యారు. గంగాప్రసాద్ గతంలో ప్రొద్దుటూరు,వెంకటగిరి లో పనిచేశారు. బదిలీపై రాయచోటి కి రావడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ అధికారులు,సిబ్బంది కమీషనర్ కి పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు. మున్సిపల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు,రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున, డిఈ సుధాకర్ నాయక్,మేనేజర్ రాధ, ఏఈ కృష్ణా రెడ్డి ఇతర అధికారులు,సిబ్బంది అయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ మాట్లాడుతూ పురపాలక పరిధిలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే పోరాటం ఉధృతం చేస్తాం

- కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షల ప్రారంభం- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:రాష్ట్ర విభజన సమయంలో జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టును నీటి సామర్థ్యం తగ్గించే ఆలోచన మానుకుని పూర్తిస్థాయి 45.72 మీటర్ల నీటిమట్టంతో నిర్మించి రాయలసీమ నీటి కొరతను తీర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద సిపిఐ రిలే నిరాహార దీక్షల ప్రారంభంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య హెచ్చరించారు. నిరాహార దీక్షలను ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ నీటి వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం, కేంద్ర జలవనరుల సంఘం చేత ఆమోదం తెలపబడి 1980లో శంకుస్థాపన చేయబడి, 2005లో ప్రారంభించబడి, 2014 రాష్ట్ర విభజన చట్టంలో జాతీయ హోదా కల్పించబడిన పోలవరం ప్రాజెక్టు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురై పూర్తికి నోచుకోకపోగా, సామర్థ్యం తగ్గించే కుట్ర జరుగుతున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేసి పోలవరాన్ని జాతికి అంకితం చేస్తానన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యక్తిగత ప్రయోజనాల కోసం పోలవరాన్ని మోడీకి తాకట్టు పెడుతోందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడం ద్వారా గోదావరి నది జలాలను కృష్ణా బేసిన్ కు తరలించడం ద్వారా కృష్ణా జలాలను కరువు పీడిత రాయలసీమలో చేపట్టిన గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ, వెలుగొండ ప్రాజెక్టులకు నీటిని సర్దుబాటు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. పోలవరం సామర్థ్యాన్ని 150 అడుగుల నుండి 90 అడుగులకు కుదించడం వల్ల ప్రాజెక్టు నీటి సామర్థ్యం తగ్గిపోయి బ్యారేజిగా మారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అందులో రాయలసీమ ఎక్కువ నష్టపోతుందన్నారు. జగన్మోహన్ రెడ్డి కి చిత్తశుద్ధి ఉంటే పోలవరం ప్రాజెక్టు పూర్తి కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్రంలో అన్ని పార్టీలను ఏకం చేయాలని అఖిలపక్ష కమిటీతో ఢిల్లీలో ఉన్నటువంటి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే అన్నమయ్య జిల్లాలో ఉన్నటువంటి అన్నమయ్య ప్రాజెక్టు, పింఛ ప్రాజెక్టు ఇసుకసురుల ధన దాహానికి, రాష్ట్ర ప్రభుత్వం నాలుగు కోట్ల ఇవ్వకుండా పోవడానికి నిదర్శనమే నాడు వచ్చినటువంటి వరదలకు ప్రాజెక్టులు కొట్టుకు పోయాయని నేడు సుమారు 900 కోట్ల వ్యయంతో కట్టాలని టెండర్లకు పిలిచిన ఇంతవరకు పనులు మొదలుపెట్టలేదని, వెలిగల్లు ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలకు నిధులు కేటాయించి కాలువలు పూర్తి చేసి రాయచోటి నియోజవర్గానికి తాగునీరు సాగునీరు అందించాలని. హంద్రీనీవా కాలువకు సమ్మర్ స్టోరేజ్‌కు రాష్ట్ర ప్రభుత్వం 1300 కోట్ల నిధులు కేటాయించి పూర్తి చేయడం ద్వారా మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు కుప్పం నియోజకవర్గాలకు తాగునీరు సాగునీరు అందుతుందని, గాలేరు - నగరి కాలువ పూర్తి కావడం ద్వారా రాయలసీమ ప్రాంతం నీటితో అన్ని చెరువులు కుంటలు నింపవచ్చని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్. జిల్లా కార్యవర్గ సభ్యులు తోపు కృష్ణప్ప, సిద్దిగాళ్ల శ్రీనివాసులు, మనోహర్ రెడ్డి, సుధీర్,మురళి విశ్వనాథ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం శివరామకృష్ణదేవరా, వంగిమళ్ళ రంగారెడ్డి, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పండుగోల మని, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కల వెంకటేష్, సిపిఐ జిల్లా నాయకులు సలీం, దేవా, తిరుమల మహిళా సమాఖ్య నాయకురాలు సునీత , పద్మ, అరుణ, శోభ, అనసూయ , దళిత కుల పోరాట సమితి నాయకులు సుధాకర్ పండరయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్లవేళలా వైద్య సేవలు అందించండి

- 104 అంబులెన్స్ లు ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు, జేసి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ లో వైద్య ఆరోగ్యశాఖ, ఫిర్యాదుల కొరకు జిల్లాకు కేటాయించిన రెండు 104 అంబులెన్స్ లను కలెక్టర్ గిరీషా పిఎస్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాషాలు పచ్చ జెండా ఊపి ప్రారంభించి, 104 అంబులెన్స్ లో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీషా పిఎస్ మాట్లాడుతూ 104 వాహనాలతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ముందుచూపుతో వ్యవహరిస్తూ ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ప్రజలకు మంచి వైద్య సేవలు అందుతున్నాయి అన్నారు. ప్రజలందరికీ వైద్య సేవలు అందాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఆశయమన్నారు. ఈ సందర్భంగా శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు మెరుగైన, వేగంగా వైద్య సేవలందించడానికే 108, 104 అంబులెన్స్ వ్యవస్థ ప్రవేశపెట్టారని, దీనికి ఆద్యుడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి అన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా కొత్త టెక్నాలజీతో తయారు చేసిన 104 వాహనాలు జిల్లాకు మంజూరు చేశారన్నారు. ఇప్పుడు జిల్లాకు వచ్చిన అంబులెన్స్‌ల వల్ల ప్రతీ గ్రామం, పట్టణంలో ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ ఓ డాక్టర్ కొండయ్య, డిసిహెచ్ ఎస్ డాక్టర్ చంద్రశేఖర్, డిపిఎమ్‌ఓ లోకవర్ధన్, 104 డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్ ప్రవీణ్ కుమాం పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతాం:ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: స్వయం సహాయక మహిళా సంఘాలలోని మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతాం అని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఓబులవారిపల్లి మండల అభివృద్ధి కార్యాలయ ప్రాంగణంలో వెలుగు అద్వర్యంలో జరిగిన మూడో విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలందరి అభిమానంతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాడు పాదయాత్ర లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తున్నామన్నారు.మండలంలో స్వయం సహాయక మహిళా సంఘాలకు 7 కోట్ల 91 లక్షా 54 వేల రూపాయల మెగా చెక్ లను అందించామన్నారు.పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి వైయస్సార్ ఆసరా పథకం ఉపయోగపడుతుందన్నారు.సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రూపాయలు మహిళల ఖాతాలో జమ చేస్తున్నామన్నారు.మహిళా సంఘాలకు రుణ మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి దేనన్నారు.ఈ కార్యక్రమంలో ఏపి టూరిజం డైరెక్టర్ వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి, ఎంపిపి చీర్ల నాగమ్మ, వైసిపి స్టేట్ ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర యాదవ్,తాహశీల్దారు పీరుమున్నీ, ఎంపిడిఓ విజయరావు, వెలుగు ఎసి వెంకటేశ్వర్లు, సర్పంచ్ నూక జయపాల్ రెడ్డి,వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సుంకేసుల రఫీ, వెలుగు ఎపిఎం ఆర్ముగం, జెసిఎస్ మండల కన్వీనర్ అమరేశ్వర రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, స్వయం సహాయక మహిళా సంఘాలు పాల్గొన్నారు.

ఆర్థిక భరోసా కల్పించేందుకే వైయస్సార్ ఆసరా: ఎమ్మెల్యే మేడా

విశాలాంధ్ర-రాజంపేట : మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే వైయస్సార్ ఆసరా కింద నిధులు మంజూరు చేయడం జరుగుతోందని శాసనసభ్యులు మేడా వెంకట మల్లిఖార్జున రెడ్డి తెలియజేశారు. సోమవారం పట్టణ పరిధిలోని సిటీ కళ్యాణ మండపం నందు డ్వాక్రా సంఘాల మహిళలకు వైయస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాల మహిళలు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేకు కోసి ఒకరినొకరు తినిపించుకుని పండుగ వాతావరణంలో వైయస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ మండల పరిధిలోని 25 పంచాయతీల, 724 డ్వాక్రా మహిళా సంఘాలకు గాను రూ 5 కోట్ల 93 లక్షల 841 లు మంజూరయ్యాయని.. ఈ నిధులను డ్వాక్రా సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా పరిపుష్టిగా ఉంటేనే కుటుంబాలు బాగుంటాయని, తద్వారా రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని భావించిన జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆసరా నిధులను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆకేపాటి మురళి రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలి వెంకటసుబ్బారెడ్డి, డిఆర్డిఏ పిడి సత్యనారాయణ, ఎంపీడీవో బాలస్వామి, వెలుగు ఏ.పీ.ఎం మదన్మోహన్ రెడ్డి, సీసీలు, యానిమేటర్లు, డ్వాక్రా మహిళలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎదుగుబొదుగులేని గిరిజన బ్రతకులు:సిపిఐ

విశాలాంధ్ర-చిట్వేలి : అన్నమయ్య జిల్లా చిట్వేల్ మండలం తిమ్మాయపాలెం పంచాయతీ నరసింహారెడ్డి ఎస్టీ కాలనీలో సిపిఐ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు గిరిజన కాలనీని నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య సిపిఐ మండల కార్యదర్శి తిప్పన ప్రసాద్‌లు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిమ్మాయపాలెం పంచాయతీ నరసింహారెడ్డి కాలనీలో 30 కుటుంబాలు వారు గిరిజనులు నివసిస్తున్నారు. వారికి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారు. ఆ ఇండ్లు కాంట్రాక్టర్లు ఆధ్వర్యంలో నిర్మించి ఇచ్చారు. అప్పుడు ఆ ఇల్లు నాణ్యత లేకుండా కట్టించడం వల్ల ఆ ఇల్లులు ఇప్పుడు పూర్తిగా గోడలు చీలిపోయి స్లాపు ఊడిపోయి నెరల్లేకి తేళ్లు పాములు జెర్రీలు వంటి విషపురుగులు వచ్చి చిన్నపిల్లలను కరుస్తాయని రాత్రి పగలు భయభ్రాంతులకు గురవుతూ అనుక్షణం ఏమి జరుగుతుందోనని కొంతమంది భయ ప్రాంతాలకు గురై ఇల్లు వదిలి చేలల్లో చెట్లల్లో బ్రతుకు తున్నారన్నారు. వర్షాకాలంలో వస్తే ఇల్లు పూర్తిగా తడుస్తాయి. ఇప్పటికే కొన్ని ఇల్లు కూడా పడిపోయిన ఇప్పుడు ఉన్న ఇండ్లు కూడా పడిపోయే పరిస్థితిలో ఉన్నాయి. కాబట్టి అన్నమయ్య జిల్లా కలెక్టర్ స్పందించి నరసింహారెడ్డి కాలనీను పరిశీలించి ఆ గ్రామానికి ఇంట్లో రోడ్లు వేసి గిరిజన బిడ్డలను ఆదుకోవాలన్నారు.

వైభవంగా సీతారాముల కళ్యాణం

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండల కేంద్రంలోని అగ్రహారంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సోమవారం వైభవంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు నూతనంగా నిర్మించిన రామాలయంలో గత మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగానే ఆదివారం రాత్రి సీతారామ, లక్ష్మణ,ఆంజనేయ విగ్రహాలన అగ్రహారంలో ఊరేగింపు నిర్వహించారు. సోమవారం ఉదయం నుండి వేద పండితులు హెూమాలు నిర్వహించి విగ్రహాల దాత ఎర్రపురెడ్డి విజయభాస్కర్ రెడ్డి రామకృష్ణారెడ్డి వారి కుటుంబ సభ్యులచే సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్ర హాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వడదెబ్బ బాదితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండలంలో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సంభవించే వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వడదెబ్బ తగిలితే బాదితుని వివరాలు సేకరించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి సహకరించాలని తాహశీల్దారు బి.రామమోహన్ సంబంధిత విఆర్‌ఓలను ఆదేశించారు. సోమవారం తాహశీల్దారు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాండ్ కన్వెన్షన్ లు పరిశీలించి పెండింగ్ పెట్టకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. వ్యవసాయ భూమి వ్యవసాయేతర భూములుగా మార్చడాన్ని ఆలశ్యం చేయకుండా పూర్తి చేయాలన్నారు. అన్ని గ్రామాలలో రీసర్వే మొదలౌతుంది సిద్ధంగా ఉండాలని స్థానికులకు తెలియ జేయాలన్నారు. ప్రజలకు, విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్స్ పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో తప్పనిసరిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి కృషి చేయాలన్నారు. నిర్లక్ష్యం చేయరాదన్నారు. స్పందన కార్యక్రమంలో తీసుకున్న నిర్ణయాలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తాసిల్దారు మానస,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, సర్వేయర్ సుదర్శన్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున రెడ్డి, విఆర్‌ఓలు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు పట్టణం, సరోజినీ దేవి వీధిలోని "దారుసలాం అహ్లే హదీస్ వెల్ఫేర్ ట్రస్ట్" ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మసీదు గురువు ఇమామ్ జాబిర్ ఉమ్రి ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలు వల్లించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యదర్శి బోదేశా, అధ్యక్షులు యూసఫ్ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరముల నుండి రంజాన్ మాసంలో నిరుపేదలకు,వితంతువులకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో మసీదు నిర్మాణం చేసినట్లు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త ప్రవచనం మేరకు "ఇరుగు పొరుగు వారు పస్తులుండి తాను మాత్రమే భుజించుట పాపం" అనే సూక్తి మేరకు ఇరుగుపొరుగు పేదలు కూడా ఉపవాసాలు ఉండటానికి మా సేవా కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు యూసఫ్, కార్యదర్శి బోదేశ, ఉపాధ్యక్షులు సలీం భాష, సభ్యులు మహమ్మద్ నూర్,ఎస్.అక్బర్ బాషా, ఎస్.కరీం బాషా, ఎస్.ఆశిఫ్, ఆరిఫుల్లా తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

మదనపల్లి-విశాలాంధ్ర: బి.కొత్తకోట నగర పంచాయతీ లోని ఊజార్లపల్లి గడ్డం వారి ఇండ్లు నుండి శెట్టిపల్లి రోడ్డు వరకు రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఈ గ్రామాలకు చెందిన ప్రజలు సూచన మేరకు శెట్టిపల్లికి చెందిన పాలు శ్రీనివాస్ రెడ్డి సొంత నిధులతో సోమవారం రోడ్డుకు మట్టితోలి మరమ్మతులు చేపట్టారు దీంతోఊజార్లపల్లి గడ్డం వారి ఇండ్లుకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు

ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలో

26 మంది విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-పీలేరు:- ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలో 26 మంది విద్యార్థుల ఎంపిక అయ్యారు. సీలేరు పట్టణంలోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఎల్ఎం కంపెనీ ఆధ్వర్యంలో మిస్టర్ గౌస్ బాషా, హెచ్ అర్ పర్యవేక్షణలో మూడు దశలుగా విద్యార్థులను పరీక్షించారు. మెదటి రౌండ్ లో కమ్యునికేషన్ స్కిల్స్ కు 145 అభ్యర్థులు హాజరుకాగా రెండవ రౌండ్ గ్రూప్ డిస్కషన్ కు 42 మంది ఎంపిక కాగా మూడవ రౌండ్ హెచ్ అర్ కు 26 మంది వి విద్యార్థులు ఎంపిక అయ్యారు. ఎంపిక అయిన విద్యార్థులకు 2.7 లక్షల రూపాయలు సాలరీగా పొందుతారని కంపెనీ హెచ్ ఆర్ తెలియజేశారు. ఎంజేర్ కళాశాల కరస్పాండెంట్ ఎంపి అవినాష్ కుమార్ రెడ్డి మరియు ప్రిన్సిపాల్ ఎస్. సుధాకర్ రెడ్డి ఎంపికైన విద్యార్థులను ఆభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఇంచార్జ్ రెడ్డి కాసీమ్, సి. రవి, కె.సురేష్ లు పాల్గొన్నారు.

రగ్బీ క్రీడా విజేతలకు సన్మానం

విశాలాంధ్ర-చిట్వేలి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్వేల్ విద్యార్థులు రగ్బీ క్రీడా పోటీల యందు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులకు నందలూరు స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ స్కాట్ గ్రూప్ వారు, నిన్న సాయంత్రం నందలూరులోని రైల్వే కళాక్షేత్రం నందు విజేతలకు సన్మాన సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్వేల్ నుంచి రగ్బీ క్రీడ యందు అత్యుత్తమ ప్రతిభ చూపిన ఈపూరి సాయి ప్రతాప్,మరిపూటి చరణ్ కుమార్ నాయుడు మరియు మహా రాణి విద్యార్థులకు సన్మానం చేయడం జరిగింది. సన్మానంతో పాటు ముగ్గురు విద్యార్థులకు మెమెంటోలు కూడా ఇవ్వడం జరిగింది. వరుసగా మూడు సంవత్సరముల నుంచి స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ వాళ్ళు నిర్వహించే క్రీడా పోటీల యందు విజేతలుగా నిలుస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్వేల్ కి వాలీబాల్ క్రీడ యందు ఓవరాల్ చాంపియన్షిప్ కూడా అందివ్వడం జరిగింది. విద్యార్థులను ప్రోత్సహించేందుకు సన్మానం చేయడం పట్ల ఓవరాల్ ఛాంపియన్షిప్ రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ డేవిడ్ దేవా ప్రసాద్,సాయి రామ్,చెంగమ్మ మరియు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు క్రీడా పీ.ఈ.టి ఉపాధ్యాయులు జగన్ వృత్తి విద్యా ఉపాధ్యాయులు చిన్న బాబు పాల్గొన్నారు.

కళ్యాణోత్సవంలో పాల్గొన్న రమేష్ రెడ్డి, ప్రసాద్ బాబు

విశాలాంధ్ర-రామాపురం : మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ మన్నేరువాండ్లపల్లె లో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామలక్ష్మణ హనుమత్ సమేత ఆలయంలో గత శనివారం నుంచి సోమవారం వరకు మూడురోజుల నుండి జరుగుతున్న హెూమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ,ధ్వజ ప్రతిష్ట, సీతారాముల కల్యాణం తెలుగుదేశం పార్టీ నాయకుడు మన్నూరు రామానుజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కళ్యాణానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాయచోటి నియోజ కవర్గం టిడిపి ఇంచార్జ్ ఆర్ రమేష్ కుమార్ రెడ్డి,మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు శ్రీసుగవాసి ప్రసాద్ బాబులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని,స్వామి వారి కళ్యాణం దగ్గర పుజారులచే ఆశీర్వాదం తీసుకొని పండితులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కలెక్టరేట్ లో చలివేంద్రం ప్రారంభించిన జిల్లా కలెక్టర్, జేసి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:వేసవి కాలం సంభవించిన నేపథ్యంలో మండే ఎండల్లో కలెక్టరేట్ కార్యాలయంకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఎంత దోహదపడతాయని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంను జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియాలు సంయుక్తంగా కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ మాట్లాడుతూ...ఎండల తీవ్రత ఎక్కువ ఉన్న నేపథ్యంలో కలెక్టరేట్ కు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ ఈ చంద్రశేఖర్ రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి జయరాజ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో సహా రేషన్ బియ్యం సీజ్

విశాలాంధ్ర-మదనపల్లి: ఆటో సహా రెండు లక్షల విలువచేసే రేషన్ బియ్యాన్ని మదనపల్లి వన్ టౌన్ పోలీసులు సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేశారు. అరెస్టుకు సంబంధించి వన్ టౌన్ ఎస్ఐ హరిహర ప్రసాద్ సోమవారం విలేకరులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మదనపల్లి పట్టణం కురవంకకు చెందిన దస్తగిరి కొడుకు షేక్ అంజాద్ ఆటోలో 750 కిలోల పిడిఎస్ రేషన్ బియ్యం లోడుచేసుకుని సోమవారం వేకువజామున మదనపల్లి నుంచి బెంగళూరుకి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా ముందస్తు సమాచారం అందిందన్నారు. ఈమెరకు సిబ్బందితో వెళ్లి బెంగళూరు రోడ్డులోని నక్కలదిన్నె సమీపంలో రోడ్డు తనిఖీలలో ఆటోలో అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని ఆటతో సహా స్వాధీనం చేసుకునే నిందితున్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన అంజద్ భాషను పోలీస్ స్టేషన్ కి తీసుకొచ్చి విచారణ అనంతరం అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి నట్లు తెలిపారు.

అచ్చన్న మరణం ముమ్మాటికి ప్రభుత్వ హత్య

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:ముఖ్యమంత్రి సొంత జిల్లాలో దళిత అధికారి అచ్చన్న మరణం ముమ్మాటికి ప్రభుత్వ హత్య అని రాష్ట్ర టిడిపి కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. సోమవారం నాడు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో రాచరిక పరిపాలన సాగుతుందని తూర్పుగోదావరి జిల్లా వేములూరు లో కూడా తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇంచార్జ్ ఉపసర్పంచ్ సత్య వర ప్రసాద్‌ని పంచాయతీ నిధుల వినియోగంలో దుర్వినియోగం జరిగిందని పలు దఫాలుగా పోరాటం చేసినందుకు వైసీపీ నాయకులు కుట్రపన్ని హతమార్చారన్నారు మరొక ప్రక్క సీఎం సొంత జిల్లాలోని దళిత ఉద్యోగి పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ అచ్చన్నది కూడా హత్య అన్నారు. ఆంధ్రప్రదేశ్లో చట్టాలు లేవని కేవలం వైసీపీ సెక్షన్లు అమలు అవుతున్నాయని దిశా చట్టం దిశా స్టేష న్లు పేరుకు మాత్రమే గోడలపై బోర్లు కనబడుతున్నాయనిచ లోపలికి వెళితే వైసిపి చట్టాలు అమలు అవుతున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకుడు అబ్బవరం చిన్న రెడ్డి యాదవ్, రాయుడు కాలనీ మైనార్టీ నాయకుడు షేక్ మహబూబ్ అలి పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు చేసిన పోలీసులు

విశాలాంధ్ర-మదనపల్లి: ఆస్తి అమ్మి భార్యకు డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్న భర్త పై మదనపల్లి ఒకటవ పట్టణ పోలీసులు వేధింపుల కేసు నమోదు చేశారు. ఎందుకు సంబంధించి ఎస్ఐ హరిహర ప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మదనపల్లి పట్టణం నీరు గట్టు వారి పల్లి రామిరెడ్డి లేఔట్ లో కాపురం ఉంటున్న గోపాలకృష్ణారెడ్డి తన ఆస్తిని ఇటీవల అమ్మేశాడు. ఆస్తి అమ్మగా వచ్చిన కొంత డబ్బును భార్య కళావతి40కి ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో బాధితురాలు కళావతి వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో, విచారణ అనంతరం గోపాల కృష్ణారెడ్డి పై వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

జగనాసుర రక్తచరిత్ర పుస్తక ఆవిష్కరించిన తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జగనాసురా రక్తచరిత్ర అనే పుస్తకాలను మాజి ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగాల్ రాయుడు పిలుపుమేరకు ఆవిష్కించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి తన సొంత బాబాయ్ నీ ఎవరు చంపారో తెలిసి కూడా చంద్ర బాబు నాయుడు మీద నెట్టడానికి ప్రయత్నించారని తెలిపారు తెలుగుదేశం పార్టీకి ప్రజాధరణ లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కల్లేరెడ్డప్ప, క్లస్టర్ ఇంచార్జ్ తాతనేని శివకుమార్ నాయుడు, టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గురిగింజ కుంట శివప్రసాద్ నాయుడు ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు, వాణిజ్య విభాగం దామోదర్ నాయుడు, నాగ సుబ్బయ్య సుండుపల్లె గ్రామ అధ్యక్షుడు సుబ్బరామయ్య, సుధాకర్ రాజు, ఎర్రం రెడ్డి, చాన్ బాషా, రైతు సంఘం నాయకుడు సుబ్బరామరాజు, గురిగింజ కుంట శ్రీనివాసులు నాయుడు,రాజన్న, చంద్రమౌళి, ఎల్వి రమణ, మేళ్ల చంద్రప్ప నాయుడు, రామాంజులు, చెన్నంశెట్టి వెంకటరమణ, కొండూరు రామరాజు, ఈ సుబ్బు, బెల్లాల రమణ, జీకే రాచపల్లి మా భాష, బెస్తపల్లి చాంద్ బాషా, కొండల్ తూర్పు విశ్వనాథ,రాజన్న, రామా, గురయ్య, బాలకృష్ణ నాయుడు రఘునాథరెడ్డి, రామాంజులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు మరియు నాయకులు పాల్గొన్నారు. వారితో పాటు మండల ప్రజలు అందురు పాల్గొని విజయవంతం చేశారు.

అక్రమ అరెస్ట్ లతో ఉద్యమాన్ని ఆపలేరు

గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు విశ్వనాధ్ నాయక్

విశాలాంధ్ర -సుండుపల్లె : జీవో నెంబర్ 52ను రద్దు చేయాలని గిరిజన బిడ్డల కడుపు కొట్టొద్దని చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు విశ్వనాథ నాయక్ ను సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లనీయ కుండ సుండుపల్లె పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో ఆయన పోలీస్ స్టేషన్ లోనే క్రింద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ సిగ్గులేని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమాలను అణిచివేయాలనుకోవడం దౌర్భాగ్యమని, గిరిజనుల చేత ఓట్లు వేయించుకుని గిరిజనులకు మోసం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులతో ఇంకా ఎన్నాళ్ళు ప్రభుత్వాన్ని కాపాడుతారని పోలీసులను ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్లలోనే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు.

జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా హుస్సేన్

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : ఏప్రిల్ నెలలో జరుగు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని అన్నమయ్య జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లి లోని ఎస్సీ వన్ టు బాలుర వసతి గృహాలు నాయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం పిల్లలకు కచ్చితంగా వడ్డించాలని ఆయన సూచించారు. అలాగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో బాగా ప్రిపేర్ అయి మంచి ఫలితాలు సాధించాలన్నారు.పదిలో మంచి ఫలితాలు సాధిస్తే సోషల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు త్రిబుల్ ఐటీ ఇంటర్మీడియట్లో మంచి కాలేజీలు సీటు సాధించవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ డబ్ల్యూ శ్రీనివాసులు, రమేష్, సూర్యకాంతమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్లను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి

విశాలాంధ్ర -రైల్వేకోడూరు: రాష్ట్రంలోని క్రిస్టియన్లను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిలువునా మోసం చేస్తున్నాడని మాజీ ఎస్సి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి హరి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కోడూరు టౌన్ లో రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు వాక్చర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి క్రిస్టియన్ కావడంతో ఓటు బ్యాంకు రాజకీయం చేస్తున్నాడని విమర్శించారు. దళిత క్రిస్టియన్ రిజర్వేషన్లు ఖండించింది జరిగిందన్నారు. ఇది పూర్తిగా జగన్ ఏకపక్ష నిర్ణయం అన్నారు.ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉండదన్నారు, ఇది కేవలం పార్లమెంటు ద్వారా ఆమోదం పొందినప్పుడే దానికి చట్టబద్ధత ఉంటుందన్నారు. దళిత క్రిస్టియన్స్ లను ముఖ్యమంత్రి నిలువునా మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అన్ని కులాలకు కార్పొరేషన్ లు ఏర్పాటు చేసి వాటికి చైర్మన్ లను, డైరెక్టర్లను నియమించి ఒక రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేసింది చాలక క్రిస్టియన్ రిజర్వేషన్లు అంటూ మరో మోసానికి తెరదీశారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఊటుకూరు చలపతి, సీనియర్ నాయకులు శంకర్ రాజు, శ్రీనివాసులు, రాజంపేట పట్టణ ప్రధాన కార్యదర్శి నాగరాజు, హోటల్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు త్వరితగతిన పరిష్కరించండి

- స్పందన అర్జీలు పరిష్కరించకుంటే చర్యలు తప్పవు - అధికారులను ఆదేశించిన కలెక్టర్ గిరీషా పిఎస్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ గిరీషా పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్ ఓ సత్యనారాయణ, భూముల సర్వే విభాగం సహాయ సంచాలకులు జయరాజ్ జిల్లా నలుమూలల ప్రజల నుండి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజల నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించి, సంబంధిత అధికారులను పిలిచి ఆ అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. స్పందనకు జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను మొక్కుబడిగా కాకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కార మార్గం చూపాలన్నారు. ఆయా దరఖాస్తులు మళ్లీ పునరావృతం కాకుండా నిర్దిష్ట గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరించకుండా మరుగున పడేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సూచించారు. అర్జీలను సంబంధిత శాఖ అధిపతులకు పంపించడం జరిగిందని, అర్జీలన్నీ సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఆయా శాఖల్లో తమ కింది స్థాయి అధికారుల వద్ద పెండింగ్ లో ఉన్న అర్జీలను పరిశీలించి బియాండ్ ఎస్ఎల్ఏలోకి ఏ ఒక్క అర్జీ వెళ్లకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. గడువు దాటి ఒక్క సమస్య కూడా ఉండకూడదన్నారు. అధికారులు అందరూ కూడా బాధ్యతతో సీరియస్ గా తీసుకొని స్పందన సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిష్కారం గురించి అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పూర్తి వివరాలతో ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై బాధితులు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

మత విద్వేషాలను రెచ్చగొడితే ఊరుకోం: చైర్మన్

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: పులివెందుల ప్రాంతంలో మత విద్వేషాలను రెచ్చగొడితే చూస్తూ ఊరుకోమని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో వైఎస్సార్ కూరగాయల మార్కెట్‌కు రంగసాథస్వామి పేరు నామకరణం చేయాలంటూ హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించడం దురదృష్టకరమన్నారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.1.20కోట్లు వ్యయంతో కూరగాయల మార్కెట్‌ను అభివృద్ధి చేశారన్నారు. ఆ తర్వాత పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న మార్కెట్‌ను రంగనాథస్వామి గుడి సమీపంలోకి మార్చారన్నారు. ప్రాచీన కాలం నాటి రంగనాథస్వామి ఆలయ సమీపంలో 2008 ఆగస్టు 24వ తేదీన మార్కెట్‌కు వారపు సంత అని పేరు మాత్రమే ఉందని, ఆ మేరకు శిలాఫలకం కూడా ఉందని తెలిపారు. అప్పటి కాంట్రాక్టర్లను కూడా తాము సంప్రదించామన్నారు. వారు కూడా ఎలాంటి పేరు చెప్పలేదన్నారు. తాము మరింత లోతుగా కూడా పరిశీలించామన్నారు. గెజిట్‌లో రంగనాథస్వామి కూరగాయల మార్కెట్ అని ఎక్కడా లేదన్నారు. కానీ ఇటీవల ఎమ్మెల్సీగా గెలిచిన రామగోపాల్‌రెడ్డి ఇంకా ప్రమాణస్వీకారం కూడా చేయలేదన్నారు. కానీ ఆయన కూడా టీడీపీ అధికారంలోకి రాగానే వైఎస్సార్ కూరగాయల మార్కెట్‌కు రంగనాథస్వామి అని నామకరణం చేస్తామని పత్రికలకు ప్రకటనల్విడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ, టీడీపీలు వారి మనుగడ కోసం హిందూ ఐక్య వేదిక ముసుగులో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వాస్తవానికి ర్యాలీలో బీజేపీ, టీడీపీ నాయకులు తప్పిస్తే హిందువులు ఎవ్వరూలేరన్నారు. ప్రశాంతంగా ఉన్న పులివెందులను రాజకీయంగా అలజడి సృష్టించాలని చూసినా, మత విద్వేసాలను రెచ్చగొట్టాలని ప్రయత్నించినా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. కొన్ని విద్రోహక శక్తులు మతోన్మాదాన్ని ప్రేరేపించేందుకు సిద్ధంగా ఉన్నాయని, ఇలాంటి సమయంలో ప్రజలు ప్రశాంతంగా ఉండాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో ఆలయ చైర్మన్ చింతకంట సుధీకర్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ డైరెక్టరు హేలు గంగాధర్‌రెడ్డి, మాజీ చైర్మన్ వెంకటసుబ్బయ్యలు పాల్గొన్నారు.

అట్టహాసంగా విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్ల పంపిణ

- జగనన్న వాహన మిత్ర పథకంలో భాగంగా... రూ.68 లక్షల ఖర్చుతో 57 మందికి స్కూటర్ల సరఫరా

- విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:దివ్యాంగులమని నిరుత్సాహ పడకుండా... ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిచ్చి, దివ్యాంగులకు ప్రత్యేక గుర్తింపును అందిస్తోందని జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్ తెలిపారు. శనివారం రాయచోటి లోని కలెక్టరేట్ ఆవరణలో విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "అట్టహాసంగా విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్ల పంపిణీ" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గిరీషా పి.ఎస్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ పి. ముంతాజ్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వినికిడి యంత్రాలు, ట్రైసైకిళు ,, వీల్ చైర్లు అందిస్తోందన్నారు. ఈసారి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి జిల్లాలో మొదటిసారిగా 57 మందికి రూ.68లక్షల ఖర్చుతో మోటోరైజడ్ స్కూటర్లను అందించడం హర్షించదగ్గ అంశం అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందించాలని ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులైనప్పటికీ ఇతరులతో పోటీపడుతూ అన్ని రంగాలలో ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత అందిస్తోందన్నారు. ఎల్లవేళలా పేద ప్రజలకు మంచి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. కుల, మత, వర్గ రాజకీయ భేదాలు చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందించాలని ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పని చేస్తున్నారన్నారు. కేంద్రంతో మాట్లాడి విభిన్న ప్రతిభావంతులకు మోటార్ వాహనాలు రావడంలో ఎంపీ మిథున్ రెడ్డి కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల వారికి మేలు చేయడం జరుగుతోందన్నారు. మహిళలకు ఆసరా, చేయూత లాంటి కార్యక్రమాలు, విద్యార్థులకు అమ్మ ఒడి లాంటి సంక్షేమ కార్యక్రమాలతో ప్రతి ఒక్కరూ ఆనందంగా సంతోషంగా ఉండాలనే సదుద్దేశంతో పరిపాలన చేయడం జరుగుతోందని చెప్పారు. గతంలో మూడు చక్రాల సైకిల్ ఇచ్చే వారిని... వాటి సైకిల్ పెడల్స్ తిప్పుతూ నడపడంలో ఇబ్బంది పడే వారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో విభిన్న ప్రతిభావంతులను దృష్టిలో ఉంచుకొని మోటరైజ్డ్ వాహనాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మీ అందరి ఆశీస్సులు, సహకారం ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఎప్పటికీ కొనసాగించాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా మూడు చక్రాల మోటార్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష, వెలుగు సంస్థ వ్యవస్థాపకులు ఉదయ్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి కిషోర్ బాబు, విభిన్న ప్రతిభావంతులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పేరును నామకరణం చేయడం దుర్మార్గం

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల కూరగాయల మార్కెట్‌కు వైఎస్సార్ పేరును నామకరణం చేయడం దుర్మార్గమని హిందూ ఐక్య వేదిక నాయకులు పేర్కొన్నారు. ఇటీవల కూరగాయల మార్కెట్‌కు వైఎస్సార్ పేరును నామకరణం చేయడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలో సోమవారం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండు నుంచి ప్రారంభమైన ర్యాలీ పూలంగళ్ల మీదుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంది. అక్కడ అనుమతి లేదంటూ పోలీసులు తెలపడంతో గేటుబయటనే వారు బైటాయించి నిరసన వ్యక్తంచేశారు. ఆ తర్వాత కొంత మంది నాయకులు మున్సిపల్ కమిషనరుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హిందూ ఐక్య వేదిక నాయకుడు వంగల శశిభూషణంరెడ్డి మాట్లాడుతూ గతంలో దేవుడున్నాడని చెప్పుకునే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇప్పుడు ఆదేవుడి పేరు లేకుండా చేశారన్నారు. చోటామోటా నాయకులు వైఎస్సార్ పేరును జపించేందుకు కూరగాయల మార్కెట్‌కు వైఎస్సార్ నామకరణం చేశారని, ఇటువంటి కుట్రలు, కుతంత్రాలు చెల్లవన్నారు. కూరగాయల మార్కెట్‌కు రంగనాథస్వామి పేరును నామకరణం చేయాలని, లేదంటే నాలుగు దశాబ్దాల పాటు పట్టం కట్టిన పులివెందుల ప్రాంత ప్రజలు రాబోవు రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. కోట్లాది మంది హిందువుల మనోబావాలు దెబ్బతినేలా వైఎస్సార్ పేరు పెట్టడానికి వారికి హక్కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. కాగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఇప్పటి వరకు ఎన్నో వాటికి వైఎస్సార్ పేరు పెట్టినా తాము ఏనాడూ ఆక్షేపించలేదన్నారు. ఇప్పటికైనా మనసు మార్చుకుని కూరగాయల మార్కెట్‌కు ప్రాచీన చరిత్రగల రంగనాథస్వామి గా పేరు మార్పు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వైఎస్ కుటుంబ సభ్యులకు కోట్లాది భక్తుల ఉసురు తగులుతుందని ఆయన హెచ్చరించారు.

సర్పంచ్ చొరవతో రాజీవ్ నగర్ కాలనీ వాసులకు

కల్వర్టుల నిర్మాణం

విశాలాంధ్ర-పీలేరు:- పీలేరు పట్టణంలోని రాజీవనగర్ కాలనీ రెండు చోట్ల దెబ్బతిన్న కల్వర్టులవలన పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో స్థానిక సర్పంచ్ హబీబ్ భాష దృష్టికి రాజీవ్ నగర్ కాలనీవాసులు తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన పీలేరు సర్పంచ్ పంచాయతీ సిబ్బంది మరియు వార్డు సభ్యులు ఎంపీటీసీలను రాజీవ్ నగర్ కాలనీకి వెళ్లి రెండు చోట్ల దెబ్బతిన్న కల్వర్టుల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసే పనులను పరిశీలించి నిర్మాణం కొరకు ఏర్పాటు చేశారు. దీంతో రాజీవ్ నగర్ కాలనీవాసులు పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా కు ప్రత్యేక అభినందనలు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలోవార్డుమెంబర్లునగర్ నాయక్ కళావతి, అభిద్,ఎంపీటీసీ జోహార్,నాయకులుకాలనీ చిన్నా, మునీర్, షకీర్,ముత వల్లిలుహయత్ బాషా,రియాజుల్లా, అర్ డబ్ల్యూ జె ఈనాగార్జున నాయక్,ఈఓ ప్రసాదరెడ్డి,శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిపంచాయితీ కార్యదర్శి సంయుక్త పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నాటక దినోత్సవం

విశాలాంధ్ర-మదనపల్లి: కళాశాల లోని విద్యార్థులకు మూవీ క్విజ్, స్క్రిప్ట్ రైటింగ్, డైలాగ్ రైటింగ్, మిమ్స్, యాక్టింగ్ మరియు సినిమాటోగ్రఫీ పై పోటీల ను నిర్వహించినారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నాటక ప్రియులు పెద్ద ఎత్తున సభలూ, సమావేశలు జరుపుకునే రోజు ఈ రోజు అని, ప్రాచీన కళల్లో నాటక కళ ఒకటి అని, దాదాపు ఒకే కాలంలో పాశ్చాత్య దేశాల్లోనూ, భారతదేశంలోనూ నాటక ప్రక్రియ మొదలైంది అని అన్నారు.

రేపు ఎక్సైజ్ వాహనాలకు వేలం పాటలు

విశాలాంధ్ర-మదనపల్లి : మదనపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 29 బుధవారం ఉదయం వాహనాలకు బేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై అంజాద్ భాషా, సీఐ శ్రీహరి రెడ్డి తెలిపారు. సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మదనపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన ద్విచక్ర, మూడు చక్రాల,4 చక్రాల వాహనాలకు అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపర్డెంట్ ఆదేశాల మేరకు బహిరంగ వేలం పాటలు ఉంటాయని తెలిపారు. వేలంపటల్లో పాల్గొనాలనుకున్నవారు ముందుగా వెయ్యి రూపాయలు తరావత్తు చెల్లించి సభ్యత్వం పొందాలన్నారు. ముందుగా సభ్యత్వం తీసుకున్న వారే వేలంపాటల్లో పాల్గొనాలని తెలిపారు. వాహనాలను వేలంలో దక్కించుకున్న వారు జీఎస్టీ చెల్లించాల్సి వస్తుందని తెలిపారు

ఒంటిపూట బడులు ప్రకటించాలి

విశాలాంధ్ర- రాయచో ° టౌన్:వెంటనే ఒంటిపూట బడులు ప్రకటించాలని ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శెట్టిపల్లి సాయికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ఐఎఫ్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పగలంతా ఎండలకు తట్టుకోలేక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు వడదెబ్బ తగిలి అవస్థతకు గురయ్యే అవకాశం ఉందని, పక్క రాష్ట్రం తెలంగాణలో మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ మాత్రం ఉపాధ్యాయులపై కక్ష సాధింపు ధరణిలో ఒంటి పూట బడుల ఊసెత్తడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థి ప్రాణాలతో చెలగాటమాడకుండా ఒంటిపూట బడులకు ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ ప్రశాంత్, భూషణ్, సాయి హేమంత్ పాల్గొన్నారు

జీవో నెంబర్ 52ను రద్దు చేసే వరకు పోరాటం ఆగదు

విశాలాంధ్ర- రాయచోటిటౌన్: జీవో నెంబర్ 52ను రద్దు చేసేంతవరకు మా పోరాట ఉద్యమం ఆగదని రాష్ట్ర గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు విశ్వనాథ నాయక్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రం రాయచోటి లోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద జీవో నెంబర్ 52 రద్దు చేయాలని కోరుతూ గిరిజన సమాఖ్య నాయకులు మోకాళ్ళపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తే ఎక్కడ చూసినా గిరిజన నాయకులను గృహనిర్బంధాలు, అక్రమ అరెస్టులు చేస్తూన్నారన్నారు. జీవో నెంబర్ 52 ను రద్దు చేసే వరకు మా పోరాటం ఆగదని అన్నారు. జీవో రద్దుచేసి శాసనసభలో ఆమోదించిన చట్టాన్ని వెనక్కి తీసుకోకపోతే గిరిజనుల సత్తా రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమృనాయక్, రామ్మూర్తి నాయక్ దివాకర్, శంకర్ నాయక్, నారాయణ నాయక్ జగన్ నాయక్, శీను నాయక్, ఆనంద్ నాయక్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-చిట్వేలి : తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల తాసిల్దార్ మురళి కృష్ణ ఆధ్వర్యంలో సోమవారము నాడుచల్లని మినరల్ వాటర్ చలివెంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్వెల్ నందు ఎండలు ఎక్కువగా ఉన్నందున కలెక్టర్ సబ్ కలెక్టర్ సూచనల మేరకు మినరల్ వాటర్‌తో చలివెంద్రము ఏర్పాటు చేశారు. దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

మదనపల్లె ఇండియన్ యూనియన్ క్లబ్

కార్యవర్గం ఏర్పాటు

విశాలాంధ్ర-మదనపల్లి రురల్: మదనపల్లె పట్టణంలో 110 ఏళ్ల చరిత్ర కలిగిన ఇండియన్ యూనియన్ క్లబ్ కార్యవర్గం ఏర్పాటు ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. ఇండియన్ యూనియన్ క్లబ్ అధ్యక్షులుగా రాటకొండ బాబురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యు. సుబ్రహ్మణ్యం (సుబ్బు), గౌరవ అధ్యక్షులుగా వి. మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మార్పురి సుధాకర్ నాయుడు, ఉప కార్యదర్శిగా బోర్ వెల్ సుధాకర్, కోశాధికారిగా దేవతా సతీష్, గేమ్స్ సెక్రటరీగా విష్ణు కాంత్, కార్యవర్గ సభ్యులుగా రాటకొండ గురు ప్రసాద్, గౌరీ శంకర్ రెడ్డి,సదాశివరెడ్డి, మార్పురి నాగార్జున బాబు లను క్లబ్ లో సభ్యత్వం కలిగి ఉన్న సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ భారతదేశంలోనే ఎంతో గణనీయమైన చరిత్ర కలిగిన మదనపల్లి యూనియన్ క్లబ్ ను అభివృద్ధి బాటలో నడిపిస్తామని చెప్పారు. అనీబి సెంట్ స్థాపించిన ఈ క్లబ్ ను నిరుపేదలకు ఉపయోగపడేలా ఆరోగ్య, సేవ కార్యక్రమాలు చేయనున్నట్లు చెప్పారు

బాధితులకు న్యాయం చేయాలి

మాజీ మునిసిపల్ చైర్మన్ ముజిబ్ హుసేన్

విశాలాంధ్ర-మదనపల్లి: మదనపల్లి మండలం వెంకటప్ప కోట తురకపల్లి గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 1103/3 పట్టా భూమిలో అక్రమంగా మట్టి అమ్మడం ఆపాలని మదనపల్లి మాజీ మునిసిపల్ చైర్మన్ ముజిబ్ హుసేన్ అధికారులను కోరారు. సోమవారం పుంగనూరు రోడ్డు నందు తమ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో అయన మాట్లాడుతూ తురకపల్లి కి చెందిన ఎస్. జై నబీ కి చెందిన పట్టా భూమిలో మట్టి అక్రమ తవ్వకం, తరలింపు లో అధికారులు బాధితులు కు అన్యాయం చేస్తూ, నాయకులు ఒత్తాసు పలకడం పై ఆక్షేపించారు. బాధితులు కుటుంబం గడవడానికి గాను పొరుగు రాష్ట్రాలకు వెళ్లి యాచించడం, పట్టా భూమి లో వ్యవసాయం తో పాటు కూలీ పనులు చేసుకొంటున్నారని అలాంటి వారికి ఇచ్చిన భూమి పై పెద్దలు కన్నేయడం పై ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, మండల తహసీల్దార్ తో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులు, మానవ హక్కుల కమీషన్, హైకోర్ట్ కు పిర్యాదు చేశారని ఈ పిర్యాదు ను సుమోటో గా కోర్టు స్వీకరించి, వివరణ ఇవ్వాలని కలెక్టర్ కు నోటీసులు ఇస్తే అక్కడి నుండి ఆర్డీఓ కు, మండల తహసీల్దార్ కు నోటీసులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు బాధ్యత యుతంగా వ్యవహరించిన హైకోర్టు కు సరైన వివరాలు ఇచ్చి పేద కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో జై నబీ, గుల్జర్బీ, మహబూబ్ బాషా లు పాల్గొన్నారు.